16-07-2025
బుధవారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 03 | సంచిక : 53 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB
జయభేరి


2 లో

# ఐకార్ బయాలజిక్స్ కు భూమి పూజ

- ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్
- పెట్టుబడులతో వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహాలు అందిస్తాం.. సీఎం రేవంత్ రెడ్డి

**పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పారిశ్రామిక రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, రాయితీలు, అనుమతులను మంజూరు చేయడం వంటి సానుకూల వాతావరణం కల్పిస్తామని చెప్పారు.**

**జయభేరి, హైదరాబాద్ :**

శామీర్‌పేట జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయాలజిక్స్ (ICHORBiologics) కొత్త యూనిట్‌కు ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఐటీ, ఎలక్ట్రిక్ వెహికిల్స్, ఫార్మా, బయో సైన్సెస్‌లతో పాటు ఇతర రంగాల్లో పెట్టుబడులతో ముందుకొచ్చే పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. "ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పెట్టుబడులకు చైనాకు ప్రత్యామ్నాయంగా పారిశ్రామిక రంగం భారత్ వైపు దృష్టి సారించగా, అందుకు అత్యుత్తమ గమ్యస్థానంగా తెలంగాణ ఉండాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీ పడాలన్నది మా ఆలోచన. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని నిర్దేశించగా, అందులో తెలంగాణ నుంచి 10 శాతం మేరకు కంట్రిబ్యూట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

# ల్యాండ్ అయిన శుభాంశు శుక్లా



**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 15:**

భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకున్నారు. వీరు అంతరిక్షంలో 18 రోజులు గడిపిన అనంతరం 22 గంటల సుదీర్ఘ ప్రయాణం చేసి భూమిపై దిగారు. కాలిఫోర్నియా సమీపంలోని సముద్రంలో నలుగురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక దిగింది. వారిని ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు వారు భూమిని చేరారు.జూన్ 25న అంతరిక్షంలోకి వెళ్లిన శుభాంశు బృందం అక్కడ పలు కీలక పరిశోధనలు నిర్వహించింది. ఈ 18 రోజుల్లో వీరు దాదాపు 96.5 లక్షల కిలోమీటర్లు ప్రయాణించారు. శుభాంశు శుక్లా 60కి పైగా శాస్త్రీయ పరిశోధనల్లో పాల్గొన్నారు. అంతరిక్షంలో ఉన్న సమయంలో ఈ బృందం 230 సూర్యోదయాలను చూసింది.

**స్వాగతించే వారిలో నేనే ఫస్ట్**

యాక్సియం4 మిషన్ విజయవంతం కావడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. అంతరిక్ష కేంద్రం నుంచి శుభాంశు శుక్లా సహా నలుగురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక కాలిఫోర్నియా సమీపంలోని సముద్రంలో దిగింది. ఈ సందర్భంగా మోదీ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు.అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను స్వాగతించే భారత ప్రజల్లో తాను కూడా ఒకడినని ఆయన పేర్కొన్నారు. శుభాంశు శుక్లా తన అంకితభావం, ధైర్యం, మార్గదర్శక స్ఫూర్తి ద్వారా కోట్లాది మందికి ప్రేరణ ఇచ్చారని ప్రశంసించారు. ఇది భారత మానవ సహిత అంతరిక్ష మిషన్ గగన్‌యాన్ దిశగా మరో ముందడుగు అని ఆయన అభివర్ణించారు.

అంతరిక్షంలో సాహసోపేతమైన, చారిత్రాత్మక మిషన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని భూమికి సురక్షితంగా తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించడం భారత అంతరిక్ష చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. శుభాంశు ప్రదర్శించిన ధైర్యం, అంకితభావం అందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్ తరాలకు మార్గదర్శిగా నిలుస్తారని అభినందించారు. పైలట్ శుభాంశు భవిష్యత్తులో మరిన్ని విజయాలను అందుకోవాలని, దేశానికి మరింత సేవ చేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## వంతెనపై నుంచి నదిలో పడిపోయిన జీపు..




2 లో

# పెండింగ్ ప్రాజెక్టులపై చర్చఏంటీ..?

## జలసంఘానికి రేవంత్ సర్కార్ ప్రశ్న

**జయభేరి, హైదరాబాద్, జూలై 15:**

దావరి నది జలాల పంపిణీపై బుధవారం ఢిల్లీలో జరిగే రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానికి ముందు తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే విషయం తెలిసిందే. అయితే ఈ సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించే అంశాన్ని ఏపీ తన ఎజెండాలో పేర్కొనగా, దీనిపై చర్చించాల్సిన అవసరం లేదని తెలంగాణ రాష్ట్రం జలశక్తి మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. దీంతో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఎలా జరుగుతుంది? అందులో బనకచర్ల ప్రాజెక్టు చర్చకు వస్తుందా రాదా అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

**తెలంగాణ రాసిన లేఖలో ఏముందంటే**

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ బుధవారం రెండు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి ఆహ్వానించింది. ఈ ఆహ్వాన లేఖలో గోదావరి బనకచర్ల అనుసంధానంపై ప్రధానంగా చర్చ జరుగుతుందని పేర్కొంది.

# జోరుగా రూ.2వేల నోట్ల మార్పిడి అక్రమ వ్యాపారం


2 లో

**ప్రస్తుతం నిబంధనల ప్రకారం రూ. 2వేల నోట్లను ఆర్‌బీఐ కార్యాలయాలు, పోస్టాఫీస్‌లలో మాత్రమే డిపాజిట్ చేసేందుకు అవకాశం ఉంది. రూ. 30వేల వరకు పరిమితి ఉంది. ప్రస్తుతం ఆదాయపు పన్నుశాఖ నేపాల్ సరిహద్దులో ఉన్న పోస్టాఫీసులపై దృష్టి సారించాయి.**

**జయభేరి, న్యూ ఢిల్లీ, జూలై 15 :**

నేపాల్‌ను ఆనుకొని ఉన్న సరిహద్దు ప్రాంతంలో రూ.2వేల నోట్ల మార్పిడి అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్నది. రూ.2వేల నోట్లు తీసుకొని వాటికి బదులుగా రూ.1200 నుంచి రూ.1600 వరకు ఇస్తున్నట్లు ఆదాయపు పన్నుశాఖ దర్యాప్తులో తేలింది. చెలామణి నుంచి పూర్తిస్థాయిలో నోట్లు ఆర్‌బీఐకి చేరలేదు. ఫిబ్రవరి నెలలో నేపాల్ సరిహద్దులోని అనేక ప్రాంతాల్లో లక్నోలోని ఆదాయపు పన్నుశాఖ దర్యాప్తు విభాగం దాడులు చేసి కీలకమైన ఆదేశాలు సేకరించింది. ఈ వ్యవహారంపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నది.సరిహద్దుకు ఇరువైపులా నోట్లను మార్చే ఈ అక్రమ వ్యాపారం జోరుగా జరుగుతోందని ఆదాయపు పన్ను శాఖ అధికారులు పేర్కొంటున్నారు. సరిహద్దులోని రక్సౌల్, రుపైదిహా, బర్హ్ని వంటి ప్రదేశాలకు ఆదాయపు పన్ను శాఖ బృందాలు విచారణ జరుపగా.. నోట్ల మార్పిడి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇందులో ఎక్కువగా నిరుద్యోగ యువకులను వాడుకుంటున్నారని.. ప్రతిగా వారికి కమిషన్ ఇస్తున్నట్లు తేలింది.

# జీహెచ్ఎంసీలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**జయభేరి, హైదరాబాద్, జూలై 15:**

తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే బోనాల పండుగను పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఊరేగింపు లో భాగంగా శ్రీ కట్ట మైసమ్మ తల్లి ని దర్శించుకున్న మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... "బోనాల పండుగ మన సంస్కృతిని, సమైక్యతను ప్రతిబింబిస్తుందని మున్సిపల్ ఉద్యోగుల భాగస్వామ్యంతో జరుపుకునే ఈ ఉత్సవం అందరికీ స్ఫూర్తిదాయకం" అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జీహెచ్ఎంసీ ఉద్యోగులు, అధికారులతో పాటు యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# భారత్‌కు బిగ్ బూస్ట్

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఐకార్ బయాలజిక్స్ కు భూమి పూజ

నిర్దేశిత గడువు నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యంతో పెట్టుకున్నాం. బల్క్ డ్రగ్స్, వాక్సిన్ల తయారీలో ప్రపంచంలోనే తెలంగాణకు పేరు ప్రఖ్యాతులు వచ్చాయంటే ఇక్కడి పారిశ్రామిక వేత్తల కృషి ఎంతో ఉంది. కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని బయపెడుతున్న సమయంలో జినోమ్ వ్యాలీ నుంచే వ్యాక్సీన్లు తయారు చేసి దాదాపు వంద దేశాలకు సరఫరా చేసిన సందర్భం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం. ఈరోజు దేశంలో 33 శాతం వ్యాక్సీన్లు తెలంగాణ నుంచి ఉత్పత్తి అవుతుండగా, 40 శాతం మేరకు బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి చేస్తున్నామంటే ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టిన వారు ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చారు. ఈ మధ్య కాలంలో బయో, ఫార్మసీ రంగంలో కూడా ప్రపంచంలోని అత్యాధునిక విధానాలు అవలంభిస్తున్న పరిశ్రమలను అహ్వానించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. జినోమ్ వ్యాలీ పెట్టుబడుదారులకు స్వాగతం పలుకుతున్నాం. ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ప్రోత్సాహకాలను అందిస్తుంది. మీ మద్దతు కావాలి. పెట్టుబడులు పెట్టండి.." అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు ఐకార్ లోగో ఆవిష్కరించగా, మంత్రి వివేక్ వెబ్ సైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు పి. సుదర్శన్ రెడ్డి, ఐకార్ మేనేజింగ్ డైరెక్టర్ సూదిని ఆనంద రెడ్డితో పాటు అధికారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులపై చర్చఏంటీ..?

అయితే దీనిపై తెలంగాణ రాష్ట్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ తాను చర్చించాల్సిన ఎజెండాను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపింది. తెలంగాణ రాసిన లేఖలోని అంశాలు ఇవే...

తెలంగాణ ప్రభుత్వంకేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు రాసిన లేఖలో బచావత్ అవార్డును ప్రధానంగా ప్రస్తావించింది. బచావత్ అవార్డు నిబంధనల ప్రకారం గోదావరి నదిపై ఏ ప్రాజెక్టుకైనా కొత్తగా నీటి కేటాయింపులు చేయరాదు. ఈ అంశాన్ని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ గుర్తించాలి. బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ పెట్టడం అంటే బచావత్ అవార్డు స్ఫూర్తికే విరుద్ధం. బనకచర్ల ప్రాజెక్టు అనేది ఆంధ్రప్రదేశ్‌లోని నదుల అనుసంధానానికి, నీటి మళ్లింపుకు సంబంధించిన అంశం మాత్రమే. ఇది గోదావరి జలాలకు కాదు, రెండు రాష్ట్రాల నీటి కేటాయింపులకు కాదుసంబంధించిన అంశం. ఇది ఏపీ అంతర్గత వ్యవహారం తప్ప ఇరు రాష్ట్రాలు చర్చించే అంశం కాదు.

బనకచర్ల ప్రాజెక్టు చర్చను పక్కన పెట్టి గోదావరి నదికి సంబంధించి రెండు రాష్ట్రాలు చర్చించే అంశాలనే ఎజెండాలో చేర్చాలి. రేపటి సమావేశం ఈ ఎజెండా ఆధారంగా జరగాలి. కృష్ణా నదిపై పెండింగ్ ఉన్న ప్రాజెక్టులపై చర్చ జరగాలి. దిండి, పాలమూరు ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలి. ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రమే చేపట్టాలి. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీల నీటిని కేటాయించాలి. 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణంపై చర్చించాలి. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలోని భద్రాచలం, ఇతర ముంపు ప్రాంతాలకు కలిగే ప్రభావంపై చర్చించాలి. ఈ అంశాలతో తెలంగాణ రాష్ట్రం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు బనకచర్ల ప్రాజెక్టును ఎజెండాలో చేర్చడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే తమ ఎజెండా అంశాలను లేఖ ద్వారా తెలియజేసింది.తెలంగాణ రాష్ట్రం బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రెండు రాష్ట్రాల మధ్య జరిగే చర్చలకు అపెక్స్ కౌన్సిల్ ఛైర్మన్‌గా జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ వ్యవహరిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సభ్యులు. అయితే తెలంగాణ అభ్యంతరాల నడుమ రేపు చర్చ జరుగుతుందా లేదా, ఒకవేళ చర్చించాలని కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ గానీ, చంద్రబాబు పట్టుబడితే పరిస్థితి ఏంటి? తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆ చర్చలో పాల్గొంటారా లేదా బహిష్కరిస్తారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. లేదా తెలంగాణ రాష్ట్రం రాసిన లేఖలో పేర్కొన్న ఎజెండా ప్రకారం చర్చ జరుగుతుందా? రెండు రాష్ట్రాల సీఎంల మధ్య ఈ జలవివాదాలపై రాజీ కుదురుతుందా లేక సమస్య ముదురుతుందా అన్న సందేహాలు ఈ లేఖ ద్వారా తలెత్తుతున్నాయి.

## జోరుగా రూ.2వేల నోట్ల మార్పిడి అక్రమ వ్యాపారం

అయితే, ప్రస్తుతం అధికారులు ఓ నోట్లు ఎక్కడికి పంపుతున్నారో తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు.ప్రస్తుతం నిబంధనల ప్రకారం రూ.2వేల నోట్లను ఆర్‌బీఐ కార్యాలయాలు, పోస్టాఫీస్‌లలో మాత్రమే డిపాజిట్ చేసేందుకు అవకాశం ఉంది. రూ.30వేల వరకు పరిమితి ఉంది. ప్రస్తుతం ఆదాయపు పన్నుశాఖ నేపాల్ సరిహద్దులో ఉన్న పోస్టాఫీసులపై దృష్టి సారించాయి. గత కొంతకాలంగా రూ.2వేల నోట్లను ఎవరు మార్పిడి చేస్తున్నారో తెలుసుకునేందుకు ఐటీ ప్రయత్నిస్తున్నది. అయితే, నోట్లను మార్చుకునే వ్యక్తులు ఫేక్ ఐడీలను ఉపయోగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అయితే, ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు కోసం ఆదాయపు పన్నుశాఖ కొందరు ప్రైవేట్ వ్యక్తులను రూ.2వేల నోట్లతో నేపాల్‌కు పంపింది. అక్కడ వారంతా ఈ నోట్లను సులభంగానే మార్చుకున్నారు. ఆదాయపు పన్నుశాఖ ఈ ఆపరేషన్‌ను గోప్యంగా నిర్వహించారు. కనీసం పోలీసుల సహాయం తీసుకోకపోవడం విశేషం. ఈ దర్యాప్తు సమయంలో నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో వేలాది యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయని ఆదాయపు పన్నశాఖకు సమాచారం అందింది. అక్రమ మసీదులు, మదర్సాలు, సమాధులను నిర్మించేందుకు అక్రమ మత మార్పిడిలకు దీన్ని ఉపయోగిస్తున్నారని.. తమిళనాడుకు చెందిన ఓ సంస్థ నిధులు సమకూరుస్తున్నట్లుగా సమాచారం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.




## త్వరలో గ్రీన్ పవర్

✍ జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ అభివృద్ధికి హైదరాబాద్ ఒక గేమ్ చేంజర్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో FTCCI నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూసీ నది పునరుద్ధరణ, రీజినల్ రింగ్ రోడ్డు పనులు పూర్తయితే హైదరాబాద్ అభివృద్ధి అంచనాలకు మించి జరుగుతుందని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు మధ్య ఐటీ, ఫార్మా, హౌసింగ్ వంటి అనేక క్లస్టర్‌లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. పెట్టుబడిదారుల సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా జరుగుతుందని, త్వరలో గ్రీన్ పవర్ అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు పెట్టుబడులకు అత్యంత అనుకూలమని డిప్యూటీ సీఎం వివరించారు. స్కిల్ యూనివర్సిటీలు, అంబేద్కర్ నాలెడ్జి సెంటర్లు, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడం, ఇక్కడ సృష్టించిన సంపదను రాష్ట్రం అంతటా విస్తరించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు.

# భారత్‌కు బిగ్ బూస్ట్

**భారత్ అంటేనే పుష్కలమైన సహజ వనరులకు కేరాఫ్ అడ్రస్. ఆంగ్లేయులు మన వనరులను కొల్లగొట్టినా.. కోట్లాది మంది భారతీయులకు ఈ పుణ్యభూమి తన సంపదను పంచుతూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలకు, ఖనిజ వనరులకు విపరీతమైన డిమాండ్ నెలకొన్న వేళ.. భారత్‌కు బూస్ట్‌నిచ్చే వార్తను శాస్త్రవేత్తలు అందించారు.**

ఈశాన్య రాష్ట్రాల్లో అరుదైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని తెలిపారు. వాటిని వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆ ఖనిజ సంపదను వెలికితీస్తే, దేశ అవసరాలకు సరిపోయేంత ఉంచుకుని, మిగిలినవి విదేశాలకు ఎగుమతి చేసుకోవడం ద్వారా.. ఆదాయం పొందే, అభివృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఆత్మనిర్భర్ భారత్ కింద.. దేశానికి కావాల్సిన వస్తువులు, ఉత్పత్తులను మనమే తయారుచేసుకునే ప్రక్రియకు ఇది మరింత ఊతమిస్తుంది.140 కోట్లకు పైగా జనాభా కలిగిన భారత్ లాంటి దేశాలకు.. ఏ వస్తువైనా భారీగానే డిమాండ్ ఉంటుంది. మన లాంటి దేశాలు.. ఇతర దేశాల నుంచి ఎన్ని వస్తువులను దిగుమతి చేసుకున్నా.. ఇంకా అవసరం పడుతూనే ఉంటాయి. దేశ జనాభా అవసరాలు తీరాలంటే దిగుమతులూ భారీగా ఉండాల్సిందే. ఇలాంటి తరుణంలో ఈశాన్య ప్రాంతం వ్యూహాత్మక, కీలకమైన ఖనిజ వనరులకు ఒక కొత్త కేంద్రంగా ఉద్భవించిందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) వెల్లడించింది. క్లీన్ ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రక్షణ తయారీ రంగాలకు అత్యవసరమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (భూమిలోని అరుదైన మూలకాలు), గ్రాఫైట్, వెనాడియం, లిథియం, కోబాల్ట్ లాంటి ఖనిజాలు ఈశాన్య ప్రాంతంలో సమృద్ధిగా ఉన్నాయని.. జీఎస్ఐ నిర్వహించిన అధ్యయనాలు, అన్వేషణలు చెబుతున్నాయి.ప్రపంచంలోనే రేర్ ఎర్త్ మాగ్నెట్స్ (భూమిలోని అరుదైన మూలకాల)కు ప్రధాన ఎగుమతిదారుగా ప్రస్తుతం చైనా ఉంది. భూమిలోని అరుదైన మూలకాలు, తయారైన మూలకాల ఎగుమతులపై ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా ఆంక్షలు విధించింది.



ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ఈ రేర్ ఎర్త్ మాగ్నెట్స్ అత్యంత కీలకం. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ 540 టన్నుల మాగ్నెట్ దిగుమతి చేసుకోగా.. అందులో 80 శాతానికి పైగా చైనా నుంచి దిగుమతి చేసుకుంది. యూరోపియన్ క్లీన్ ఎనర్జీ రంగం కూడా తన రేర్ ఎర్త్ మాగ్నెట్స్ అవసరాల్లో దాదాపు 98 శాతం చైనా నుంచి దిగుమతి చేసుకుంటుంది. చైనా విధించిన ఆంక్షలతో పశ్చిమ దేశాలతో పాటు భారత్‌లోనూ తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. దీనిపై స్పందించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్.. భారత్ రేర్ ఎర్త్ మాగ్నెట్స్ కోసం చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి, ఇతర సప్లై చైన్ వెతికేందుకు ఒక మేల్కొలుపు లాంటిదని గత నెలలో కీలక వ్యాఖ్యలు చేశారు.దేశీయంగా పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో.. చైనా ఆంక్షలు.. మన దేశంలోనే వనరులను వెలికితీసే ప్రక్రియ ఆవశ్యకతను మరోసారి గుర్తు చేశాయి. అలాంటి వనరుల కోసం భారత్‌లో డిమాండ్ పెరుగుతున్న సమయంలో ఈశాన్య ప్రాంతంలో ఉన్న అరుదైన ఖనిజ సంపదకు సంబంధించి.. జీఎస్ఐ 57 పేజీల నివేదికలో వెల్లడించడం గమనార్హం. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ నిధులతో ఈశాన్య ప్రాంతంలో ప్రస్తుతం అనేక ప్రాజెక్టులు జరుగుతున్నాయి.భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలపైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలు.. 2.62 లక్షల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఇది దేశం మొత్తం భౌగోళిక ప్రాంతంలో 8 శాతం. ఈశాన్య ప్రాంతం ప్రత్యేకమైన భూగర్భ నిర్మాణాన్ని కలిగి ఉండి.. ఒఫియోలైట్ బెల్టులు, ఆల్కలైన్‌అల్ట్రామాఫిక్ కాంప్లెక్స్‌లు, గ్రాఫైట్‌బేరింగ్ స్కిస్టులతో కూడినవని.. అనేక ముఖ్యమైన ఖనిజాలకు అనుకూలమైన వాతావరణాన్ని అందిస్తున్నాయని జీఎస్ఐ పేర్కొంది.

టెక్నాలజీ అభివృద్ధి, క్లీన్ ఎనర్జీ వైపు భారత్ సిద్ధమవుతున్న తరుణంలో.. ఈశాన్య ప్రాంతంలో ఉన్న ఖనిజ వనరులు కీలక పాత్ర పోషించనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.మన దేశంలో సహజ ఫ్లేక్ గ్రాఫైట్‌కు అత్యంత ముఖ్యమైన దేశీయ వనరుగా అరుణాచల్ ప్రదేశ్ అవతరించింది. వెస్ట్ సియాంగ్, పాపుమ్ పారే, లోయర్ సుబన్సిరి జిల్లాల్లో గ్రాఫైట్ ప్రధాన నిక్షేపాలను గుర్తించారు. అక్కడ 17.89 మిలియన్ టన్నులకు పైగా గ్రాఫైట్ వనరులు ఉన్నాయని జీఎస్ఐ అంచనా వేసింది. ఈ ప్రాంతంలోని గ్రాఫైట్ సాధారణంగా 5 శాతం నుంచి 25 శాతం వరకు స్థిర కార్బన్ కంటెంట్‌తో కూడిన సన్నని మధ్యస్థ ఫ్లేక్‌లను కలిగి ఉంటుందని తెలిపింది. ఇది లిథియంఅయాన్ బ్యాటరీ అనోడ్‌ల వంటి వాటికి అనుకూలమైన ముడి పదార్థంగా చేస్తుందని పేర్కొంది. ఇక అరుణాచల్ ప్రదేశ్‌లోనే మరో ప్రధాన ఖనిజం వెనాడియంను గుర్తించారు. స్టీల్ మిశ్రమాలు, ఇతర పారిశ్రామిక అవసరాల్లో ఈ వెనాడియంను ఉపయోగిస్తారు. 13.79 మిలియన్ టన్నుల వెనాడియం ఉంటుందని అంచనా వేస్తున్నారు.అస్సాం, మేఘాలయ రాష్ట్రాల్లో జీఎస్ఐ చేసిన పరిశోధనల్లో భూమిలోని అరుదైన మూలకాలు ఉన్నట్లు తెలిసింది. అస్సాంలో వెయ్యి నుంచి 5 వేల పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) గాఢతతో భూమిలోని అరుదైన మూలకాలు ఉన్నట్లు జీఎస్ఐ కనుగొంది.

మేఘాలయలో 3,646 నుంచి 5,100 పీపీఎం మధ్య భూమిలోని అరుదైన మూలకాలు విలువలను చూపించాయని పేర్కొంది.అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, అస్సాం రాష్ట్రాల్లో లిథియం నిక్షేపాల సూచనలు ఉన్నాయని జీఎస్ఐ నివేదిక వెల్లడించింది. అయితే వీటి అన్వేషణ ఇంకా ప్రారంభ దశల్లోనే ఉన్నప్పటికీ.. మన దేశం లిథియం కోసం దిగుమతులపైనే భారీగా ఆధారపడటాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. వీటికి సంబంధించి మరింత అన్వేషణ చేయాల్సిందే. అదే సమయంలో భూరసాయన సర్వేలు, పెట్రోగ్రాఫిక్ అధ్యయనాల ద్వారా లక్ష్యంగా చేసుకుని నాగాలాండ్, మణిపూర్‌లోని ఒఫియోలైట్ కాంప్లెక్స్‌లతో సంబంధం ఉన్న నికెల్, కోబాల్ట్‌ను కనుగొన్నారు. ఈ రెండు రాష్ట్రాల్లోని పురాతన శిలల ఆనవాళ్లుగా నికెల్, కోబాల్ట్ ఉన్నాయని.. వాటిని ఆర్థికంగా తిరిగి పొందడానికి అత్యాధునిక టెక్నాలజీ అవసరమని తెలుస్తోంది.ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న కీలక ఖనిజాల పరిశోధనలను మరింత వేగవంతం చేయడానికి.. 2024, 25లో క్రిటికల్ మినరల్ అసెస్మెంట్ ప్రోగ్రామ్ (సీఎంఏపీ)ని ప్రారంభించింది.

ఈ కార్యక్రమం కింద.. మణిపూర్‌నాగాలాండ్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోని లాటరైట్, కార్బొనేషియస్ శిలలు, ఆల్కలైన్ కాంప్లెక్స్‌ల సామర్థ్యాన్ని అంచనా వేయడంపై దృష్టి సారించనున్నారు.ఈ ఈశాన్య రాష్ట్రాలు వివిధ దేశాలతో సరిహద్దును పంచుకుంటున్నాయి. చైనా, భూటాన్, మయన్మార్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి ఐదు దేశాలు భారత ఈశాన్య ప్రాంతానికి సరిహద్దులుగా ఉన్నాయి.

ఈ భౌగోళిక స్థానం దేశ ఈశాన్య ప్రాంతానికి జాతీయ భద్రత, దేశ యాక్ట్ ఈస్ట్ పాలసీ కింద సరిహద్దు వాణిజ్యం, ఆర్థిక ఏకీకరణ పరంగా వ్యూహాత్మకంగా ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది.అంతేకాకుండా ఈశాన్య రాష్ట్రాల్లో భూభాగం ఎక్కువగా కొండలు, పర్వతాలు, లోయలు, విశాలమైన నదీ లోయలు, విస్తృతమైన అటవీ విస్తీర్ణంతో నిండి ఉంది. ఇవన్నీ అక్కడి గొప్ప జీవవైవిధ్యాన్ని చూపిస్తున్నప్పటికీ.. రవాణా పరంగా, మౌలిక సదుపాయాల పరంగా అనేక సవాళ్లను దేశం ముందు ఉంచుతున్నాయి. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ.. ఈశాన్య ప్రాంతంలో ఉన్న ఖనిజ సామర్థ్యం కారణంగా మరింత ఆసక్తికరంగా, ఆకర్షించే విధంగా ఉంది. ఈ పరిశోధనలు దేశ భవిష్యత్తుకు కొత్త దారులు తెరుస్తాయని మనందరం ఆశిద్దాం.



## కేంద్రమంత్రి అమిత్‌షాతో సీఎం చంద్రబాబు భేటీ..

✍ జయభేరి, ఢిల్లీ :

ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. సుమారు 40 నిమిషాలపాటు ఆయనతో పలు అంశాలపై చంద్రబాబు చర్చించారు. ఈ సమావేశంలో పలు రాష్ట్ర సమస్యలను సీఎం కేంద్రమంత్రికి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. క్లిష్టమైన పరిస్థితుల్లో ఏపీకి అండగా నిలుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సీఎం ధన్యవాదాలు తెలిపిపారు. అంతే కాకుండా మాజీ కేంద్ర మంత్రి, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతి రాజును గవర్నర్‌గా నియమించడంపై హోం మంత్రి అమిత్ షా కు, కేంద్రానికి, ప్రధానికి ధన్యవాదాలు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఆ తర్వాత రాష్ట్రానికి చెందిన పలు అంశాలపై అమిత్ షాతో ముఖ్యమంత్రి చర్చించారు. గత ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధిని సీఎం చంద్రబాబు అమిత్‌షాకు వివరించారు. ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను కేంద్రం అందించిన సహకారంతో గాడిలో పెడుతున్నామని ఆయన కేంద్రమంత్రికి తెలిపారు.

అయితే ఇప్పటికీ ఆర్థిక వనరుల పరంగా తీవ్రమైన కొరతను ఎదుర్కొంటున్న రాష్ట్రానికి కేంద్రం నుంచి మరింత సహకారం అవసరమనే విషయాన్ని సీఎం ప్రత్యేకంగా కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సాయం కోరారు. విభజన వల్ల ఏపీ ఎదుర్కొన్న ఆర్థిక నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని నిధుల కేటాయింపులు చేసేలా చూడాల్సిందిగా 16 ఆర్థిక సంఘానికి నివేదించినట్లు అమిత్ షాకు సీఎం చంద్రబాబు వివరించారు.

**బనకచర్ల లింక్ ప్రాజెక్టు ప్రస్తావన..**

బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయాన్ని సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు నీటిని తరలించేందుకు కీలకమైన పోలవరం -బనకచర్ల లింక్ ప్రాజెక్టు (BPLP)ను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో పోలవరం నుంచి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్ వరకూ 200 టీఎంసీల వరద నీటిని తరలించేలా ఈ లింక్ ప్రాజెక్టు ప్రతిపాదించినట్లు వివరించిన సిఎం వివరించారు. గోదావరి నదిలో ఎగువ, దిగువ రాష్ట్రాల నీటి అవసరాలు తీర్చిన తర్వాత కూడా 90 నుంచి 120 రోజుల మిగులు నీరు ఉందని సిఎం కేంద్రమంత్రికి తెలిపారు. చివరి రాష్ట్రంగా గోదావరి మిగులు జలాలను పూర్తిగా వినియోగించుకునే హక్కు ఏపీకి ఉందని సీఎం చంద్రబాబు కేంద్రమంత్రికి వివరించారు.

## వంతెనపై నుంచి నదిలో పడిపోయిన జీపు..



■ స్పాట్‌లోనే ఎనిమిది మంది మృతి!

✍ జయభేరి, ఉత్తరాఖండ్ :

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ వాహనం సుని వంతెన సమీపంలో అదుపుతప్పి నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే 8 మంది ప్రాణాలు కోల్పోయారు.కాగా ప్రమాద సమయంలో వాహనంలో 13 మంది ఉన్నట్టు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. కొంత మంది ప్రయాణికులతో మువాని పట్టణం నుంచి బోక్తాకు బయల్దేరిన ఓ వాహనం సుని వంతెనకు సమీపంలోకి రాగానే అదుపుతప్పి వంతెనపై నుంచి నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది అక్కడికక్కడే మరణించారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు. వాహనం నదిలో పడే సమయంలో ప్రయణికులు కాపాడమని కేకలు వేసినట్టు కొన్ని నివేదికలు పేర్కొన్నారు. వాహనం ప్రమాదానికి గురైన సమయంలో అందులో 13 మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలుస్తోంది. అందులో 8 మంది చనిపోగా మిగతా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని ప్రాణాలతో రక్షించి హాస్పిటల్‌కు తరలించారు. అయితే మరణించిన వారితో ఇద్దరు విద్యార్థులు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. చనిపోయిన వారంతా బోక్తాకు చెందిన వారుగా సమాచారం అందుతోంది. ఇక ఈ ప్రమాదంపై రాష్ట్ర సీఎం ధామి స్పందించారు. 8 మంది ప్రాణాలు కోల్పోవడంపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. మరోవైపు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని సీఎం ధామి ఆకాంక్షించారు.

# వామపక్ష హింసను ధైర్యంగా ప్రతిఘటించి..

## జాతీయవాదంతో కన్నూర్ ముఖ చిత్రాన్ని మార్చిన "మాస్టారు"

**జయభేరి, కేరళ :**

ధైర్యానికి నిలువెత్తు రూపం, సైద్ధాంతిక నిబద్ధతకు ప్రతిరూపం, అట్టడుగు స్థాయి నుంచి ఎదిగి, శక్తిమంతునిగా నిరూపింతం చేసుకున్న వ్యక్తి, కేరళలోని కన్నూర్ కి చెందిన ప్రముఖ విద్యావేత్త, ఆరెస్సెస్ కార్యకర్త సదానందన్ మాస్టర్ ను రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేశారు. సామాజిక సేవలో నిత్యం ముందుండే సదానందన్ మాస్టర్ ను బీజేపీలో అందరూ "మృత్యుంజయుడు" గా పిలుచుకుంటారు. 1994 లో సీపీఎం కార్యకర్తలు ఆయనపై ఘోరంగా దాడికి దిగారు. ఈ దాడిలో సదానందన్ మాస్టర్ రెండు కాళ్లూ పోగొట్టుకున్నారు. అయినా.. సీపీఎం నేతల గుండాగిరీకి ఏమాత్రం వెరవలేదు. సిద్ధాంతం పట్ల, అంతే స్థిరచిత్తంతో సామాజిక సేవలో పాల్గొన్నారు. మేరు పర్వంతం లాంటి ధైర్యాన్ని ప్రదర్శిస్తూ.. ముందుకే సాగారు. నిత్యం చిరునవ్వు, నిండైన ధైర్యం, సంకల్ప బలంతో పుష్టిగా వున్న వ్యక్తి మాస్టారు. తన రెండు కాళ్లూ పోగొట్టుకున్నా... మున్ముందుకే సాగారు. గ్రామీణ విద్యకే తన జీవితాన్ని అంకితం చేశారు. నిత్యం రాజకీయ హింస చెలరేగే కన్నూర్ లోనే మార్పుకు శ్రీకారం చుట్టారు. కన్నూర్ రాజకీయ బాధితుల పక్షాన నిలబడి వాదించారు కూడా. అమానవీయ కమ్యూనిస్టు భావజాలం, దాని హింసకు వ్యతిరేకంగా నిలబడుతూ, జాతీయవాదానికి చిహ్నంగా నిలబడ్డారు. అయితే.. విచిత్రం తెలుసా.. చిన్నతనంలో సదానందన్ మాస్టారు సీపీఎం సభ్యుడు. యూనిట్ కార్యదర్శి కూడా. అయితే ఎదుగుతున్నా కొద్దీ... ఆ భావజాలంలో వున్న శూన్యతను, డొల్లతనాన్ని, హింసావాదాన్ని వ్యతిరేకించాడు. ఆ తర్వాత సీపీఎంను విడిచిపెట్టి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వైపు ఆకర్షితులై, కార్యకర్తగా ఎదిగారు. కన్నూర్ ప్రాంతంలో ఆరెస్సెస్ విస్తరణకు విశేషంగా కృషి చేశారు. జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ కూడా అప్పట్లో బాధ్యతలు నిర్వర్తించారు. ఇదే అక్కడి కమ్యూనిస్టు నేతలకు ఆకళింపు కాలేదు. సీపీఎంను వదిలి ఆరెస్సెస్ వైపు వెళ్లడాన్ని అదో పెద్ద నేరంగా భావించారు. జాతీయవాద భావజాలాన్ని, జాతీయవాదుల్ని అణచడానికి సీపీఎం వారు హింసాత్మక మార్గాలన్ని ఎంచుకున్నారు. అవకాశం కోసం కాచుక్కూర్చున్నారు. సదానందన్ మాస్టార్ తన సోదరి వివాహానికి సంబంధించిన సన్నాహాల్లో మునిగారు. ఆహ్వాన పత్రాలు పంచే పనిలో వున్నారు. సరిగ్గా అదే సమయంలో అంటే (1994, జనవరి 25) న కమ్యూనిస్టు కార్యకర్తలు సదానందం మాస్టార్ వాహనాన్ని అడ్డగించారు. ఆయన్ను బయటికి లాగి, దారుణంగా కొట్టారు. అత్యంత పాశవికంగా, గూండాల మాదిరి ప్రవర్తిస్తూ అతని రెండు కాళ్లనూ నరికేశారు. దీంతో



రోడ్డు మీదే విపరీతమైన నొప్పితో మాస్టారూ విలవిలడారు. రక్తపు మడుగులో పడిపోయారు. దీంతో అతడు చనిపోయాడని కమ్యూనిస్టు కార్యకర్తలు భావించి, రోడ్డుమీదే వదిలేసి వెళ్లిపోయారు. ఇంత క్రూరాతి క్రూరంగా కమ్యూనిస్టు నేతలు ప్రవర్తించారు.

కానీ...సదానందన్ మాస్టారు బతికే వున్నారు. వెంటనే అతని స్నేహితులు, సంఘ స్వయంసేవకులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. తెగిపడ్డ రెండు కాళ్లను కూడా ఆస్పత్రికే తీసుకెళ్లారు. ఆ తర్వాత మాస్టారు ప్రాణాలతో బయటపడ్డారు. కానీ కాళ్లను కోల్పోయారు. అప్పటి నుంచి కృత్రిమ కాళ్లను అమర్చుకొని, నడుస్తున్నారు. నేటికీ సిద్ధాంతాన్నే అసిధార వ్రతంగా ఉపాసిస్తూ, అచంచలమైన నిబద్ధతతో ముందుకు సాగుతున్నారు. కేరళలో జాతీయవాద ఉద్యమానికి దృఢమైన సంకల్పానికి ప్రతీకగా నిలిచారు. తరువాత బీజేపీలో చేరి, ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. మరో కీలకమైన విషయం కూడా మాస్టారి జీవితంలో వుంది. ఇంత దారుణమైన దాడి జరిగి, కాళ్లు పోగొట్టుకున్న సమయంలోనే ఆయన వివాహం కూడా నిశ్చయమైంది. ఆయన్ను బెడ్ మీద చూసిన కాబోయే భార్య చలించిపోయింది. కొంత కాలం డిప్రెషన్ లోకి కూడా వెళ్లిపోయారు. అయినా.. తాను సదానందం మాస్టార్ నే పెళ్లి చేసుకుంటానని తెగేసి చెప్పారు. ఆయన్నే వివాహం కూడా చేసుకున్నారు. కోలుకున్న తర్వాత ఆయన పాఠశాల ఉపాధ్యాయునిగా పనిచేశారు. విద్యార్థులు సదానందన్ మాస్టార్ ను ఓ హీరోగా ఉపాసించారు. మాస్టారూ తన కృత్రిమ అవయవాలతోనే పుస్తకాలు, లంచ్ బ్యాగును తీసుకొని, నిత్యం చిరునవ్వుతోనే పాఠశాలకు వెళ్లి, ఉపాధ్యాయత్వాన్ని నెరవేర్చారు. విద్యార్థులందరూ అతడ్ని ప్రేమతో "మాషే" అని పిలుచుకుంటారు.

**కమ్యూనిస్టు పార్టీ గ్రామం "కన్నూర్"...**

కన్నూర్ అనేది కమ్యూనిస్టులకు బలమైన కోట. దాదాపు 40 గ్రామాలు సీపీఎం పార్టీకి గట్టి పట్టున్న ప్రాంతాలే. ఇతర పార్టీలు పనిచేయడానికి గానీ, విస్తరణకు గానీ అనుమతించరు కూడా. పత్యం, మోకేరి, కిజక్కే, కాతిరూర్, కయ్యూర్, చోక్లి, పంథక్కల్, మడపీడిక, పూక్కోమ్, పరాడ్, మనంతేరి ప్రాంతాలు అందులో ముఖ్యమైనవి. ప్రజాస్వామ్యాన్ని తుంగులో తొక్కి, కమ్యూనిస్టులు.. అక్కడ రాజకీయాలు చేస్తుంటారు. కొన్ని గ్రామాల్లో అయితే ఏకంగా "కమ్యూనిస్టు పార్టీ గ్రామానికి స్వాగతం" అని బోర్డులే వుంటాయి. నిజమైన ఫాసిజం ఈ ప్రాంతాల్లో కనిపిస్తుంది. అంతేకాకుండా కమ్యూనిస్టు పార్టీ జెండాలు, గోడ పోస్టర్లు, బ్యానర్లు మాత్రమే వుంటాయి. ఇతర పార్టీల జెండాలు గానీ, గోడ పోస్టర్లు గానీ, బ్యానర్లను కానీ అనుమతించరు.ఇంత ఘోరంగా రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను కమ్యూనిస్టు నేతలు తుంగలో తొక్కేస్తారు. ఇంకో ప్రమాదకర విషయం ఏమిటంటే ఈ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కూడా లేవు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఈ గ్రామాలుంటాయి. నిరుద్యోగం కూడా అంతే స్థాయిలో వుంటుంది. అయితే.. ప్రస్తుతం అక్కడి పరిస్థితులు పూర్తిగా మారిపోతున్నాయి. సదానందం మాస్టార్ చేసిన కృషి, జాతీయవాదులు, స్వయంసేవకుల కృషి, ఆదర్శవాదంతో కమ్యూనిస్టు గ్రామాల సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నాయి. కమ్యూనిస్టు నేతల కబంధ హస్తాల నుంచి ప్రజలు బయటికి వస్తున్నారు. ఇంతటి మార్పు రావడానికి చాలా మంది స్వయంసేవకులు తమ ప్రాణాలను మాత్రం కోల్పోయారు.



## తెల్లవారు జామునే ఫైరింగ్

- దిల్‌సుఖ్‌నగర్‌లో సీపీఐ రాష్ట్ర నాయకుడు చందు నాయక్ దారుణ హత్య

**జయభేరి, హైదరాబాద్, జూలై 15 :**

హైదరాబాద్ నగరంలో వరుస నేర సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.. ఈ క్రమంలోనే.. మలక్‌పేట్ లోని శాలీవాహననగర్ పార్క్ లో కాల్పులు కలకలం రేపాయి. దుండగులు జరిపిన కాల్పుల్లో సీపీఐ నేత చందూరాథోడ్ అక్కడికక్కడే మృతి చెందాడు.. వాకింగ్‌కి వెళ్లిన చందూ రాథోడ్‌పై దుండగులు 4 రౌండ్ల పాటు కాల్పులు జరిపారు. చాలా కాలంగా సీపీఐ నేత రాజేష్‌తో రాథోడ్‌కు విభేధాలున్నాయని.. అతనే ఈ దారుణానికి పాల్పడి ఉండొచ్చని.. రాథోడ్ కుటుంబసభ్యులు రాజేష్‌పై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.నాగరకర్నూల్ జిల్లా అచ్చంపేటకి చెందిన చందూ రాథోడ్ కుటుంబంతో కలిసి కొంతకాలంగా చైతన్యపురిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో మలక్‌పేట్ లోని శాలీవాహననగర్ పార్క్ లో వాకింగ్ కు వెళ్లాడు.. వాకింగ్ చేసి ఇంటికి వెళ్తున్న సమయంలో.. రాథోడ్‌పై దుండగులు కాపు కాచి కాల్పులు జరిపారు. స్నేహితులతో కలిసి నడుచుకుంటూ వెళ్తుండగా.. ముందు మృతుడి కళ్లలో కారం చల్లారు.. ఆ తర్వాత పరిగెత్తుతున్న అతడిని వెంటాడి వెంబడించి గన్‌తో 4 రౌండ్ల కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ఆపై స్విఫ్ట్ కారులో దుండగులు పరారయ్యారు. రాథోడ్ పై ఐదుగురు వ్యక్తులు కలిసి కాల్పులు జరిపినట్లు స్థానికులు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చందూ హత్యకు పాతకక్షలు కారణంగా ప్రాథమిక అంచనా వచ్చారు.



**చెంగిచెర్ల ఆర్టీసీ కాలనీ నివాసి అయిన ఎం సంపత్ రెడ్డి (శిల్పం) ప్రతిభా పురస్కార్ అవార్డు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం జరిగింది.**

**జయభేరి, మేడిపల్లి**

# ఆపద్బాంధవులు

# ఆర్ యం పీ.. లు..!

- గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద ప్రజలకు ఆయువు పోసేది ఆర్. ఎం.పీ..లే..!
- కదారి శ్రీనివాస్ జయభేరి ప్రతినిధి

**జయభేరి, శాలిగౌరారం :**



కులమత బేధాలను చూడకుండా, అందరిని సమానంగా చూసే గురుతర బాధ్యతను మోసేది వారే.. ఆధునిక నాగరిక సమాజంలో సాంకేతిక రంగంలో అగ్రగామిగా ముందుకు పోతున్న భారత దేశానికి పల్లెలే పట్టుకొమ్మలుగా ఉంటాయని మహాత్మా గాంధీ ఏనాడో చెప్పాడు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో ఉన్న ఆయా గ్రామాల్లో ఉన్న ఆర్.ఎం.పీలు సామాజిక సేవతోపాటు తమ బాధ్యతను తమ భుజాలపై మోస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో కులమతాలకు తావియ్యకుండా, డాక్టర్లుగా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు. ఇక ఇదే కోవలో శాలి గౌరారం మండలంలోని ఇటుకుల పహాడ్ గ్రామంలోని వైద్య సేవలు అందించే ఆర్ఎంపీలు విస్తృతమైన సేవలు అందిస్తూ, పేద ధనిక, బడుగు బలహీన వర్గాలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్యాన్ని అందించే ఆరోగ్య ప్రదాతలుగా ప్రజల మన్ననలను పొందుతున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మూడు నుంచి నాలుగు వేల మంది ప్రజలకు ఒకవైపు ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలతో పాటు ఇంకోవైపు ఆర్ఎంపీలుగా వృత్తిని కొనసాగిస్తున్న వైద్యులు తన, మన, భేదం లేకుండా కుల,మత బేధం చూపకుండా ధనిక బీద పేద బడుగు బలహీన వర్గాలకు ఆపద సమయంలో అండగా తోడుండి ప్రథమ చికిత్సను అందిస్తూ వారిని ప్రాణాపాయం నుండి కాపాడుతూ ప్రజల దీవెనలు పొందుకుంటున్నారు. అర్ధరాత్రి కడుపు నొప్పుంది అంటే కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్ళలేని గ్రామీణ



ప్రజల ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకున్న వాళ్లు దేవునితో సమానులు. అందుకే "వైధ్యో నారాయణ హరి" అని చెప్పారు కదా. సమ సమాజ స్థాపనలోనూ సామాజిక సేవలోను తనదైన ముద్రను వేసుకుంటూ ఇటుకుల పహాడ్ గ్రామంలో ఆర్ఎంపీలు వైద్య సేవలు అందిస్తున్నారు. మంచి అనుభవంతో వైద్య వృత్తిలో నైపుణ్యాన్ని సంపాదించుకొని ఉన్న ఊరిలోనే పేద ప్రజలకు సేవలు అందియాలని సత్ సంకల్పంతో వైద్య సేవ అందిస్తున్న వారికి ప్రజలు ఎప్పుడూ రుణపడి ఉంటారని గ్రామీణ ప్రజలే గంట పదంగా చెప్తున్నారు. ఇలాంటి సందర్భంలో ప్రభుత్వం వారికి చేయూతను అందిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సేవలతో ఆపద సమయాల్లో స్థానిక వైద్య సేవ అందిస్తున్న ఆర్ఎంపి డాక్టర్లు అందించే వారికి ప్రభుత్వం గుర్తింపునిస్తూ వారికి తగిన విధంగా అవకాశాలను కల్పిస్తే ఇంకా విస్తృతంగా సేవలు చేయడానికి ప్రజల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించడానికి వీలవుతోంది అని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఎంత సంపాదించామని కాదు, ఎంత ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.. అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటే అలాంటి ఆరోగ్యాన్ని కాపాడేది గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలుగా పనిచేస్తున్న వైద్యులే దీనికి ప్రధాన పెట్టుబడిగా భావించవచ్చు. ఇక శాలిగౌరారం మండలంలోని ముఖ్యంగా ఇటుకుల పహాడ్ గ్రామంలో ఆర్ఎంపీల సేవలను పరిశీలించి జయభేరి చేసిన సర్వేలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని వారి సేవలకు ప్రజల మధ్య ఉన్న తత్ సంబంధాలకు మీడియా వారధిగా ఉంటూ వారి సేవలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజలకు మరింత సేవ చేసే లాగున మీడియా పనిచేస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వం దయతో వారికి తోడ్పాటును అందివ్వాలి. అలాగే ఆర్ఎంపీలుగా పని చేస్తున్న వైద్యులు గ్రామంలో పేద ధనిక బడుగు బలహీన వర్గాలకు ఏ సమయంలో ఎలాంటి ఆపద వస్తుందో తెలియదు కాబట్టి అలాంటి సందర్భంలో ప్రజల నుంచి మంచి స్పందన సంపాదించుకున్న వారు నిజంగా అతి సంపన్నులు అని చెప్పవచ్చు. బాబాయ్ అన్న తమ్ముడు మామ బావ అనే వరుసలతో కలుపుకుపోతూ ప్రతి సమయంలోను గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు వైద్యాన్ని అందించేవారు. ఈనాటి సాంకేతిక రంగంలో గ్రామాన్ని నమ్ముకుని బ్రతుకుతూ సామాజిక సేవ చేస్తున్న వారే నిజమైన సామాజిక సేవకులుగా పరిగణించవచ్చు. వారే అత్యంత సంపన్నులుగా అభివర్ణించవచ్చు...





## క్రీడాకారుల ప్రోత్సాహంతోనే ప్రపంచ గుర్తింపు సాధ్యం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, హైదరాబాద్, జూలై 15:**

క్రీడాకారులకు కావలసిన మద్దతు, మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే వారు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునే అవకాశముందని ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. విక్టరీ బ్యాట్మెంటన్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి లతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, "ప్రతిభకు మార్గదర్శకత్వం, సదుపాయాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. యువతలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయాలంటే ఇటువంటి అకాడమీల ప్రాధాన్యత మరింత పెరుగుతుంది" అని అన్నారు. ప్రాంతీయ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలంటే క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం ఇవ్వాలని, ప్రభుత్వం దిశగా ముందడుగు వేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ వ్యవస్థాపకులు వెంకట రమణా రెడ్డి, చెక్క ప్రసాద్, కోనేరు భాస్కర్, వాసులను అభినందించిన ఎమ్మెల్యే, యువతకు ఇది ఒక మంచి వేదిక అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రావు నగర్ కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి, కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, బాల్కా సుమన్, గెల్లు శ్రీనివాస్, కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి, సీఐ భాస్కర్ రెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రామంతపూర్ భగయత్ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా..

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

రామంతాపూర్ బగాయత్ వెంకట సాయి నగర్ కాలనీ సర్వే నెంబర్ 40 ,40/A బీరప్ప దేవాలయం వెనకాల లైన్ లో సాంక్షన్ అయి ప్రారంభోత్సవం జరగాల్సినటువంటి బ్రిడ్జ్ స్థలాన్ని కాలనీవాసులతో కలిసి పరిశీలించిన బండారి లక్ష్మారెడ్డి. ఈ మేరకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడు..తూ బాక్స్ కల్వర్టు పనులను వచ్చే వారంలో ప్రారంభిస్తానని వాటితోపాటు కాలనీలో డ్రైనేజీ లైన్లు సీసీ రోడ్లు సాంక్షన్ చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంధం నాగేశ్వరరావు, బోసానీ పవన్ కుమార్ ,సర్వే సత్తయ్య యాదవ్, రమేష్‌గౌడ్, ఎ. విజయేందర్ రెడ్డి, శంకర్, రమేష్ యాదవ్, హుస్సేన్, శివ యాదవ్, ఐలేష్ యాదవ్, గోపాల్,అశోక్, గోవింద్, శీను, పరశురాం, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 19వ తేదీన బీఆర్ఎస్వీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు



**జయభేరి, ఉప్పల్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విషప్రచారాలను తిప్పికొట్టేందుకు అవసరమైన విషయాలను బీఆర్ఎస్ విద్యార్థి విభాగానికి తెలియజేయనున్న కేటీఆర్, హరీష్‌రావు. ఈ నెల 19వ తేదీన ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ డివిజన్ లో గల VNR Garden లో ఫంక్షన్ హాల్లో కేటీఆర్, హరీష్ రావు అధ్యక్షతన జరగనున్న శిక్షణ కార్యక్రమం. ఏర్పాట్లను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మెన్ రాకేష్, BRSV రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, BRS పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేలం ప్రక్రియను నిలుపుదలకు కృషి చేస్తా..

- ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ హెచ్ బీ కాలనీ మెయిన్ రోడ్ పై ఉన్న కమ్యూనిటీ హాల్ ను హౌసింగ్ బోర్డు డిపార్ట్మెంట్ వారు వేలం వేయుటకు నిర్ణయం తీసుకొని ముందస్తు జాగ్రత్తగా కాలనీల సంక్షేమ సంఘాలకు కెవిఎట్ పిటిషన్ వేసి నోటీసులు ఇవ్వడం జరిగిందని, ఈ కమ్యూనిటీ హాల్ వేలం ప్రక్రియని నిలుపుదల చేసి, ఈ కమ్యూనిటీ హాల్ ని కాపాడవలసిందిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని, కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాసరెడ్డితో కలవగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హెచ్ బీ కాలనీ ఫేజ్ 1 అండ్ ఫేజ్ 2 కాలనీల సంక్షేమ సంఘ ప్రతినిధులతో మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ని కలిసి సమస్యను వివరించడం జరిగింది. ఈ సమస్యపై స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో అధికారులను, మంత్రులను కలిసి సమస్య పరిష్కరించే విధంగా సహకారం అందిస్తానని, ఈ వేలం ప్రక్రియను నిలుపుదలకు కృషి చేస్తానని తెలిపారు.



## త్వరగా పనులు పూర్తి చేయాలి

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ 26వ డివిజన్‌లో జరుగుతున్న రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డితో కలిసి మాజీ మేయర్ అమర్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ.. పనుల నాణ్యత చూసి, స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, బండి శ్రీనివాస్, హనుమాన్ టెంపుల్ డైరెక్టర్స్ వంగూరి పరమేష్, తావిటి ప్రశాంత్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కును బాధిత కుటుంబానికి అందజేసిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల



**జయభేరి, పరవాడ:**

పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం రావాడ పంచాయతీకి చెందిన మోటూరు వినాయక రామసత్య అరుణకు 2,00,479 రూపాయలను సీఎం సహాయనిధి ద్వారా లబ్ధి పొందిన చెక్కును పెందుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మంగళవారం బాధిత కుటుంబంకి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబం మాట్లాడుతూ సీఎం సహాయ నిధి నుంచి తమకు సహకారం అందే విధంగా కృషి చేసిన ఎమ్మెల్యే పంచాకర్లకు, స్థానిక నాయుకులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో 79 వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు , పరవాడ మండల పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్న, పెందుర్తి నియోజకవర్గం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన అనిల్ రెడ్డి



**జయభేరి, గజ్వేల్, జూలై 15 :**

మేడ్చల్ నియోజకవర్గం తుర్కపల్లి జీనోమ్ వాలీలోని ఐకార్ బయాలజీ సంస్థ కంపెనీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మర్యాదపూర్వకంగా కలిసిన సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చెట్టిపల్లి అనిల్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అనిల్ రెడ్డితో మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడిన వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని,కాంగ్రెస్ పార్టీలో ఓపికతో ఉన్నవారికి తప్పకుండా పదవులు వస్తాయని,రానున్న స్థానికసంస్థల ఎన్నికలలో యువతకి అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్లను అందజేసిన తహసిల్దార్




**జయభేరి, తుర్కపల్లి, జూలై 15:**

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలో 12 మంది లబ్ధిదారులకు గ్రామపంచాయతీ ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల ప్రెస్టీంగులను మంగళవారం తహసిల్దార్ దేశ నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హుల అందరికీ విడుదలవారీగా ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు బొత్త రాములు, షాగా బాలరాజు, జూపల్లి తిరుపతి, ఆలేటి జ్యోతి శ్రీశైలం ,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జింకల ఎల్లేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి నవీన్, లబ్ధిదారులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలు కలెక్టర్లకు కీలక ఆదేశాలు

**జయభేరి, హైదరాబాద్:**

తెలంగాణ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు ఇచ్చింది. పోలింగ్ సిబ్బంది డేటాను వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని సూచించింది. ఫిబ్రవరిలో నమోదైన రిటర్నింగ్,సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది వివరాలను పునఃపరిశీలించాలని తెలిపింది. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండలం, పంచాయతీలు,వార్డుల సంఖ్య ఆధారంగా వివరాలు ఉండాలంది దీంతో త్వరలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది.

# LKG పిల్లాడి స్కూల్ ఫీజు కోసం బ్యాంక్ లోన్..




## EMIలు కట్టలేక అల్లాడుతున్న తల్లిదండ్రులు..!!

**ప్రభుత్వాల బాధ్యత ఏమిటి...? అనేదే.. ఇప్పుడు అందరి లో మెదులుతూనే ప్రశ్న..!! అందరికీ సమానమైన ఉన్నతమైన విద్య అందించాలనే".. రాజ్యాంగ ప్రాథమిక సూత్రాన్ని ఏనాడో మన ప్రభుత్వాలు మరిచిపోయాయి.**

విద్యా వ్యాపారులకు అనుకూలంగా ప్రభుత్వ రంగంలో విద్యాసంస్థల ఏర్పాటును బోధన మౌళిక సదుపాయాల కల్పన ఏనాడో మరిచారు. గతకాలంగా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి విద్య "ఒడి....దీవేన"పేరుతో విద్యార్థి తల్లిదండ్రులను తమ రాజకీయ బానిసలుగా మార్చారు. ఈ మత్తులో విద్యార్థి తల్లిదండ్రులు రాజ్యాంగ ప్రాథమిక హక్కులను కూడా మరిచారు ప్రశ్నించే తత్వం కోల్పోయారు. పాఠశాల ఫీజులు విపరీతంగా పెరుగుతున్నాయి, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఎల్‌కేజీ నుండి ఉన్నత విద్య వరకు ఫీజుల పెరుగుదల 30 శాతం దాటింది. తల్లిదండ్రులు పిల్లల పాఠశాల ఫీజుల కోసం లోన్లు తీసుకోవాల్సి వస్తోంది. ఇంతకు పిల్లాడు స్కూల్‌కు వెళ్తున్నాడంటే ఎలా చదువుతున్నాడు మీవోడు అని అడిగేవారు. కానీ, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చదువు సంగతి దేవుడెరుగు స్కూల్‌కు వెళ్లే పిల్లాడి తల్లిదండ్రులను ఎవరైనా ముందు అడిగే ప్రశ్న ఏ స్కూల్ ఫీజు ఎంత అని అడుగుతున్నారు. మధ్యతరగతి కుటుంబాలు గతంలో పెద్ద రోగాలు, అనారోగ్య సమస్యలు వస్తే భయపడేవారు ఆస్పత్రి ఖర్చులకు కానీ ఇప్పుడు పిల్లలను స్కూల్‌లో చేర్పించాలనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎందుకంటే నర్సరీ ఎల్‌కేజీ పిల్లాడికి ఎన్ని వేలు, లక్షలు అడుగుతారో అనే భయం. ప్రస్తుత కాలం ఎడ్యుకేషన్ ఒక పక్కా కమర్షియల్ బిజినెస్ అయిపోయింది. భారీగా పెరిగిపోతున్న స్కూల్ ఫీజులు మధ్యతరగతి కుటుంబాలపై పెను భారంగా మారుతున్నాయి.

కొంతమంది మధ్యతరగతి వాళ్లు ఏకంగా పిల్లల ఎల్‌కేజీ ఫీజు కోసం ఏకంగా బ్యాంక్ లోన్ తీసుకుంటున్నారు. వాటికి ఈఎంఐలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం వినేందుకు విచిత్రంగా ఉన్నా చాలా భయంకరమైన పరిస్థితి వచ్చేసిందనే అంశాన్ని గమనించాలి. స్కూల్ ఫీజు కట్టేందుకు లోన్లు తీసుకోవడం, వాటికి ఈఐఎంలు కట్టే పరిస్థితి వచ్చేసిందంటే భవిష్యత్తు మరింత డేంజర్‌గా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో పరుదులు దాటుతున్న ఈ విద్య వ్యాపారం పై విద్య వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారతదేశంలోని స్కూల్ ఫీజులపై వారు స్పందిసూ.. “30% ఫీజు పెంపు. ఇది దొంగతనం దోపిడీ కాకపోతే, ఏమిటి?” అని.. బెంగళూరులో చాలా మంది తల్లిదండ్రులు 3వ తరగతికి సంవత్సరానికి దాదాపు రూ.2.1 లక్షలు చెల్లిస్తున్నారని తెలుసుకుని ఆశ్చర్యపోవలసిందే.. ఇక మన రాష్ట్రంలో ఈ ప్రైవేటు విద్యా వ్యాపార ఫీజుల వ్యవహారం ఇక చెప్పనవసరం లేదు. అనుభవించే తల్లిదండ్రులకు ఫీజులు చెల్లించలేక అవమానాలు పడుతున్న విద్యార్థులకు ఈ చేదు అనుభవాలు తెలుసు. భారతదేశంలోని మొత్తం కుటుంబ ఆదాయంలో విద్య ఖర్చులు ఇప్పుడు 19 శాతం ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అంటే ఓ వ్యక్తి నెలకు 10 వేలు సంపాదిస్తే.. అందులో 1900 తీసి పక్కనపెట్టాల్సిందే. అధికారిక డేటా ప్రకారం విద్యా ద్రవ్యోల్బణం దాదాపు 4 శాతం ఉందని, కానీ తల్లిదండ్రులు తమ జేబులపై దాని ప్రభావాన్ని ఎక్కువగా చూస్తున్నారని తెలిపారు.

మధ్యతరగతి కుటుంబాల ఆదాయాలు గత దశాబ్దం కాలంలో సంవత్సరానికి 0.4 శాతం మాత్రమే పెరిగాయి. కానీ, స్కూల్ ఫీజులు ఏకంగా 30, 40 శాతం పెరిగాయి.. దీని ఫలితంగా ఆయా కుటుంబాలు ఇప్పుడు నర్సరీ లేదా ప్రాథమిక పాఠశాల ఫీజులు చెల్లించడానికి EMIలు తీసుకుంటున్నాయి. భవిష్యత్తులో పై చదువుల అంటే కాలేజీ కోసం పొదుపు చేయడం అటుంచితే ఇప్పుడు కేవలం ఎల్‌కేజీ, యూకేజీకే తల్లిదండ్రులు అప్పు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో ఈ విద్య వ్యాపారా.. నియంత్రణ కు ఏర్పాటు చేసిన "రెగ్యులేటరీ కమీషన్" (APSERMC) పేద మధ్యతరగతి లో ఓ చిగురు ఆశ కల్పించిన కొద్ది రోజులకే మూతబడింది.. ఎప్పుడైతే అసలు ఆ ఊసే లేదనుకోండి. ఆసర్ 2024, పరాక్ 2025 సర్వేల ఫలితాలను చూస్తే దిమ్మ తిరిగిపోతుంది.

**అక్షరం వ్రాయడం.. చదవడం రాని బిడ్డలు**

గణితంలో కూడికలు తీసివేతలు బాగ హారాలు చేయలేని మన పిల్లలు వ్యవహారం సగం మంది పైనేనని.. అయితే ఇప్పుడు తల్లిదండ్రులు ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే మనం పిల్లల భవిష్యత్ గురించి ఏమి ఆలోచిస్తున్నామో ఏమి కోరుకుంటున్నామో అది తెలుసుకొని పిల్లలకు విద్యను అందించండి.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**జయభేరి, పరవాడ:**




అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వాడ చీపురుపల్లి గ్రామంలో మంగళవారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారిచే నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి చుట్టూ పక్కల గ్రామాలు నుంచి విశేష స్పందన లభించింది .ఈ కంటి వైద్య శిబిరాన్ని ట్రస్ట్ సభ్యులు,మాజీ ఎంపీపీ మాసవరపు అప్పల నాయుడు, ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీను కలిసి ప్రారంభించారు. అలాగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకట రావు, ట్రస్ట్ సభ్యులు సింగంపల్లి రామారావు, లెక్కల సత్యనారాయణ మాస్టార్, వార్డు సభ్యులు వియ్యపు ముత్యాలు, గ్రామ కమిటీ కార్యదర్శి కొమ్మోజు రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో మొత్తం 106 మంది రోగులకు కంటి పరీక్షలు చెయ్యించుకొన్నారు వీరికి ఉచితంగా మందులు,ఐ డ్రాప్స్ ఆదించారు.కంటి పరీక్షలు చేయ్యించుకొన్న 32 మంది రోగులను కంటి ఆపరేషన్స్ కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, పేదలకు వైద్య సేవలు అందిస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ బృందానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు. ఈ వైద్య శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణలు డా. పి. వివేక్ వర్మ, క్యాంపు మేనేజర్ అరుణ్ కుమార్, నర్సింగ్ స్టాఫ్ అమృత వర్షిణి, వైద్య సిబ్బంది, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రమాణ స్వీకార మహోత్సవం

**జయభేరి, దేవరకొండ :**



లయన్స్ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజు కోటి రూపాయల తో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని లయన్ అమరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ మిత్ర, లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ సహస్ర నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. పేదవారి యొక్క ఆకలిని అవసరాలను గుర్తించి వారి వద్దకు వెళ్లి సేవ చేసే ఏకైక సంస్థ లయన్స్ క్లబ్ అన్నారు.

నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కోశాధికారులను ఎన్నుకొని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. లైన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ మిత్ర అధ్యక్షులుగా ఇడెం రాములు, ప్రధాన కార్యదర్శిగా మాకం చంద్రమౌళి(సీఎం), కోశాధికారిగా చిలుకూరి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర అధ్యక్షురాలుగా సిరాందాసు భాగ్యలక్ష్మి , ప్రధాన కార్యదర్శిగా మిర్యాల మధుబాల, కోశాధికారిగా తిప్పర్తి రేఖ రెడ్డి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పేదవారిని గుర్తించి వారి ముంగిటకు వెళ్లి సేవా కార్యక్రమాలు నిర్వహించడం కోసం లైన్స్ క్లబ్ పనిచేస్తుందని తెలిపారు. విద్యా వైద్యం ఆరోగ్యంతో పాటు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించి అత్యధికంగా దేవరకొండ నియోజకవర్గం లో కంటి శాస్త్ర చికిత్సలు చేయించిన సంస్థ లైన్స్ క్లబ్ అని పేర్కొన్నారు.




తాను ఏడాది కాలంలో అత్యంత గొప్ప కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. సమాజం లయన్స్ క్లబ్ వైపు చూస్తుందని వారి నమ్మకానికి వమ్ము చేయకుండా తన పిఎస్టి లతో కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తారని పేర్కొన్నారు.

ఆ తరహాలో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి లయన్స్ లయన్ తీగల మోహన్ రావు, ప్రమాణస్వీకార అధికారులు కోడె సతీష్ కుమార్, మురళీదర్ రెడ్డి, జోన్ చైర్మన్ వనం బిక్షమయ్య, సముద్రాల ధనంజయ, గాజుల రాజేష్ ,చీదెళ్ళ వెంకటేశ్వర్లు, వనం శ్రీనివాసులు, పగిడిమర్రి శ్రీనివాసులు, లయన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## డిండి తహసీల్దారుగా హనుమంతు శ్రీనివాస్ గౌడ్

**జయభేరి, డిండి :**

డిండి తహసిల్దారుగా హనుమంతు శ్రీనివాస్ గౌడ్ మంగళవారం పదవి బాధ్యతలు చేపట్టారు. దేవరకొండ సివిల్ సప్లై డిటిగా పనిచేస్తున్న శ్రీనివాస్ గౌడ్ పదోన్నతి పై డిండి తహసీల్దారుగా నియామకం అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న తాసిల్దార్ ఆంజనేయులు బదిలీపై నల్లగొండకు వెళుతుండడంతో ఆయనకు వీడ్కోలు పలికి అభినందనలు తెలిపారు. డిండి తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ గౌడ్ ను డిండి మండలానికి చెందిన పలువురు తహసిల్దార్ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో డిండి మండలంలో ఆర్ఐగా జూనియర్ అసిస్టెంట్ గా పనిచేసిన అనుభవం ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాలు సూచనలను పాటిస్తూ మండల ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ పనిచేస్తానని తెలిపారు.

## 303 కోట్లతో కంటోన్మెంట్ సివరేజి, నాలల అభివృద్ధి

- ఎంపి ఈటల

**జయభేరి, సికింద్రాబాద్:**

మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం జరిగిన కంటోన్మెంట్ బోర్డు మీటింగ్ లో పాల్గొన్నారు. తరువాత ఈటల మాట్లాడుతూ రాజీవ్ రహదారి, నాగపూర్ హైవే ఫ్లైఓవర్ కింద పోయిన భూములకు రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు జమ చేసింది. హుస్సేన్ సాగర్ పక్కన ఉండటం వలన కంటోన్మెంట్లో వర్షం వస్తే ఇళ్లల్లో పది అడుగులు నీరు చేరుతుంది, 303 కోట్లతో కంటోన్మెంట్లో ఎక్కడ నీరు నిలవకుండా సివరేజ్, నాలాలతో బయటికి పంపించే విధంగా ఈ డబ్బులు ఖర్చు పెడుతున్నామని అన్నారు. సీతారామపురం ఏరియాలో అనేక కాలనీలు ఉన్నాయి. ఎప్పుడు వరదలు వచ్చినా మొట్టమొదట ముంపుకు గురయ్యే ప్రాంతం. దానికి కూడా శాశ్వత పరిష్కారం చేయబోతున్నాము. మురికి నీళ్లతో దుర్గంధపు వాసనతో రామన్నకుంట ఉంది. దాన్ని వాకింగ్ ట్రాక్ తో పచ్చని చెట్లతో ప్రజలు సెదదిరే విధంగా దాన్ని తీర్చిదిద్దబోతున్నాం. గవర్నమెంట్ దగ్గర కొనుక్కున్న ప్లాట్ లను ఇబ్బంది పెట్టొద్దని వాళ్లకు పర్మిషన్లు ఇవ్వాలని డెసిషన్ తీసుకోవడం జరిగిందని అన్నారు. కంటోన్మెంట్ పార్కులు, ఓపెన్ జిమ్ములు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలతో మంచి ప్రణాళికతో సుందరమైన కంటోన్మెంట్ గా తయారు చేయబోతున్నామని అన్నారు.

# నల్లగొండ జిల్లా 23వ సిపిఐ మహాసభ




- రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం మతోన్మాద రాజకీయాలను రెచ్చగొడుతున బిజెపి
- సాగునీటి ప్రాజెక్టుల కోసం జిల్లాల అష్టదిగ్బంధం కు సిద్ధం కావాలి
- అసమానతలు లేని సమాజ నిర్మాణమే.. కమ్యూనిస్టు లక్ష్యం
- దేవరకొండలో జరిగిన నల్లగొండ జిల్లా 23వ, సిపిఐ మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**జయభేరి, దేవరకొండ :**

రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలను రెచ్చగొడుతుందని సిపిఐ రాష్ట్ర కార్య దర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.దేశంలో పెట్టుబడిదారు లు కార్మికుల శ్రమను దోపిడి చేస్తున్నా రని. అసమానతలు లేని సమాజం నిర్మించడమే కమ్యూనిస్టుల లక్ష్యమని, కమ్యూనిజానికి అంతం లేదని, మానవ సమాజం ఉన్నంతవరకు కమ్యూనిజం ఉంటుంద న్నారు.మంగళవారం నల్లగొండ జిల్లా 23వ,జిల్లా మహాసభ దేవరకొండ పట్టణంలోని అమరజీవి మందడి నర్సింహా రెడ్డి ప్రాంగణం (సాయి రమ్య ఫంక్షన్ హాల్)లో నిర్వహించారు.మహాసభ కు ముందు సిపిఐ జాతీయ సమితి సభ్యులు,మాజీ ఎమ్మెల్యే, పల్లా వెంకట రెడ్డి సిపిఐ పతకాని ఎగురవేశారు మహాసభ ప్రారంభ ఉపన్యాసంలో సాంబశివరావు మాట్లాడుతూ.ప్రపంచంలో అత్యంత శ్రమజీవులు, కార్మికులు కలిగిన పెద్ద పార్టీ కమ్యూనిస్టు అని ప్రపంచంలో ఏ దేశంలోనైనా కమ్యూనిస్టులు ఉంటున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్, బిజెపి లాంటి ఇతర బూర్జువా పార్టీలు వారి ప్రాంతాలకు పరిమిత మైతారని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలుగా పూర్తి చేసుకుందని, పేదల పక్షాన నిలబడేది ఎర్ర జెండా పార్టీ అని ఆయన కొనియాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అమిత్ షా 2026 మార్చి వరకు అంతం చేస్తామని చెప్పడం దుర్మార్గం అన్నారు. మావోయిస్టులు అంటే ఎవరో కాదని,వారు మనవాళ్లేనని ఆపరేషన్ కగార్ పేరు తో చంపడం అటవీక న్యాయమా అని ప్రశ్నించారు. దేశంలో మావోయిస్టులను చంపుతుంటే ప్రశ్నించింది సిపిఐ మాత్రమేనని. అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి కగార్ ఆపరేషన్ ఆపాలని నిలదీసిందన్నారు. దేశంలో దోపిడీ చేసేవారు చట్టసభలలో ఉంటే ప్రజల కోసం పనిచేసేవారు అడవులలో, రోడ్లమీద ప్రజల మధ్య ఉంటే పాలకులు వీరిపై అక్రమంగా పెట్టిన కేసులతో, నిర్బంధంతో జైల్లో ఉన్నారని వీరిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజల పైన ఉందన్నారు. భారతదేశంలో ఎప్పుడో ఒకప్పుడు కమ్యూనిస్టుల రాజ్యం వస్తుందన్నారు.

వివిధ కారణాల వల్ల విడిపోయిన కమ్యూనిస్టులంతా బేషజాలాలు వదిలేసి ఒక తాటిపై వస్తే దోపిడి వర్గాల రాజ్యాన్ని కూల్చవచ్చు అన్నారు. గత పదేళ్లు రాష్ట్రంలో నియంతృత పోకడ అవలంబించిన కేసీఆర్ ను గద్దె ఎక్కనివ్వకుండా ఓడించడంలో సిపిఐ ప్రధాన భూమిక పోషించిందన్నారు. ఆగస్టు మాసంలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని ఈ ఎన్నికలలో కమ్యూనిస్టు అభ్యర్థులు అధిక స్థానంలో గెలుపొందాలని ప్రస్తుతం నడుస్తున్న పొత్తు ధర్మాన్ని పాటించడంతోపాటు స్థానికంగా ఉన్న రాజకీయ పరిణామాలను పరిగణలోకి తీసుకొని ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో సిపిఐ బాలాన్ని చూపించడం జరిగిందని తెలంగాణ రాష్ట్రంలో బిజెపిని అడుగుపెట్టనివ్వకుండా ఉప ఎన్నికల్లో బిజెపి ఓడించడం జరిగిందన్నారు. ఎన్నికల పొత్తులో భాగంగా రాష్ట్రంలో కాంగ్రెస్ కి మద్దతు ఇచ్చినప్పటికీ జిల్లాలో ఉన్న ప్రధానమైన సమస్యలపై పోరాడవలసిన అవసరం కమ్యూనిస్టులకు ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో సిపిఐ అనేక సమస్యలపై రాజీ లేని పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఉందని, నాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపిన మహోత్తరమైన చరిత్ర జిల్లాకే దక్కిందన్నారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తి చేయకుంటే జిల్లాలో దిగ్బంధం చేసేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 26న ఖమ్మం జిల్లాలో జరిగే సిపిఐ 100 వసంతాల జాతీయ స్థాయి ముగింపు బహిరంగ సభకు దేశం నలుమూల నుండి లక్షలాదిమంది తరలివస్తున్నారని ఈ జిల్లా నుండి కూడా లక్షలాది మంది త కమ్యూనిస్టులకు ఊహించని పరిణామాలు..

**ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిజాన్ని అంతం చేయలేరు...**
**మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి**

కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిజంని అంతం చేయాలని చేస్తున్న కుట్రలు సమంజసం కాదని కమ్యూనిజం అజేయమని కమ్యూనిజానికి అంతం లేదని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి అన్నారు దేశంలో మతోన్మాదం రోజురోజుకు పేట్రేగిపోతుందని అధికారం ఓట్ల కోసం బిజెపి మతోన్మాద ఎజెండా ఎంచుకొని ప్రజలకు మధ్య చిచ్చు పెట్టదు అధికారాలను కోసం పాకులాడుతుందని దేశ యువత ప్రజాస్వామ్యవాదులు ఆలోచించి బిజెపి చేసే కుట్రలను తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ దోపిడిదారులకు బడా బాబులకు ప్రభుత్వ రంగ సంస్థలను రారా దత్తం చేస్తున్నదాని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను కార్మిక హక్కులను కాలరాస్తుందని ఆయన అన్నారు దేశంలో కమ్యూనిస్టులకు మంచి రోజులు రాబోతున్నాయని రాబోవు రోజుల్లో కమ్యూనిస్టు పార్టీకి పూర్వ వైభవం రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి కాల పరిమితి, అధిక నిధులు కేటాయించాలి...**
**సిపిఐ జిల్లా కార్యదర్శి, MLC నెల్లికంటి సత్యం**

కెసిఆర్ ప్రభుత్వం గత పదేళ్లలో జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని, సిపిఐ జిల్లా కార్యదర్శి, MLC నెల్లికంటి సత్యం ఆరోపించారు. డిండి ఎత్తిపోతల పథకానికి హడావుడిగా శంకుస్థాపన చేసినప్పటికీ డిపిఆర్ ఆమోదించకుండా ప్రాజెక్టుకు ఎక్కడినుండి నీరు తెస్తారో అనేది స్పష్టత లేకుండానే ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టుకు 1800 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని కేవలం నిధులు కేటాయించడమే కాకుండా కాల పరిమితి ప్రకటించి అధిక నిధులు కేటాయిస్తే తప్ప పూర్తి కాదని పేర్కొన్నారు. గోదావరి జలాలను ఆంధ్ర ప్రాంతానికి తరలించుకోవాలని ప్రయత్నంలో భాగంగానే బనకచర్ల ప్రాజెక్ట్ ప్రస్తావన ముందుకు వస్తుందని బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ కరువు పీడితతో అనేక ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఫార్మా కంపెనీల ద్వారా కాలుష్యం వెదజల్లుతుందన్నారు.

ఇప్పటికే చౌటుప్పల్ లాంటి ప్రాంతం కాలుష్యంతో ప్రజలు అనారోగ్యాలకు గురై ఇబ్బందులు పడుతున్నారని ఈ ఫార్మా కంపెనీలను రాకుండా అడ్డుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం మహాసభలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించబోతున్నామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పల్లా దేవేందర్ రెడ్డి, టి వెంకటేశ్వర్లు, బొ ల్లె మంజుల అధ్యక్ష వర్గం వహించగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి,సినియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి,ఉజ్జిని రత్నాకర్ రావు ,ఉజ్జిని యాదగిరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య,గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్,ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,ఆర్ అంజ చారి,బొడ్డుపల్లి వెంకటరమణ, బంటు వెంకటేశ్వర్లు,బొల్లురి నర్సింహా, గురిజ రామచంద్రం, నల్పరాజు రామలింగయ్య, వల్లమల్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





## దేవరకొండ మండల కార్యదర్శి ఎన్నిక

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం కార్యదర్శి గా B వెంకటయ్యను సామజిక వేత్త BC సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి
డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్బంగా B వెంకటయ్య మాట్లాడుతు నా మీద నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని గ్రామాల్లో BC కమిటీ నిర్మాణం, బీసీ సమస్యలపై, బీసీలను చైతన్యం చేస్తూ, 42 శాతం రిజర్వేషన్ పై ప్రభుత్వ మొండి వైఖరిని అందరికి వివరిస్తూ BC ల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలియజేశారు.

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, హైదరాబాద్ :**

ఇటీవల ప్రమాదానికి గురై, శస్త్ర చికిత్స అనంతరం హైదరాబాద్ లోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి ని మంగళవారం బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఆయన వెంట PACS చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెల్లుగురి వల్లపు రెడ్డి, పీ ఏ పల్లి మాజీ వైస్ ఎంపీపీ ముఖ్య సలహాదారులు అర్వపల్లి నర్సింహ, సంకు కొండల్ రెడ్డి, బొడ్డుపల్లి మహేందర్, గోలి గిరి, తదితరులు ఉన్నారు.

## తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక వనమహోత్సవం కార్యక్రమం




**జయభేరి, పీ ఏ పల్లి :**

తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన "వనమహోత్సవం" లో భాగంగా, పి.ఏ.పల్లి మండలంలోని తిరుమలగిరి గ్రామంలో 1,500 ఈత మొక్కల నాటే లక్ష్యంలో భాగంగా 300 మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్, ఎస్.ఐ, సిబ్బంది, స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏజెన్సీ గ్రామాల్లో వైద్య శిబిరాలు




**జయభేరి, చర్ల, జూన్ 15 :**

చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గుంపెనగుడెం గ్రామాలలో మంగళ వారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో ఉన్న ప్రజలను గుర్తించి, వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. చర్ల జూనియర్ కాలేజీ , వైద్య శాఖ సమన్వయంతో దోమల మందు స్ప్రే చేపించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ... వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు ఎవరైనా అనారోగ్యంతో ఉంటే వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కనకదుర్గ రామ్ ప్రసాద్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రో వైడర్ శిరీష. తులసి. లక్ష్మి. లలిత. స్వరూప. స్వరాజ్యలక్ష్మి. ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భర్త ఇంటిముందు భార్య బైఠాయింపు

**జయభేరి, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మండలం చిన్నబోనాలో భర్త గోస్కుల పరశురాములు ఇంటి ముందు భార్య బైఠాయించింది. అధనపు కట్నం కోసం భర్త అంతింటి వారు వేధిస్తున్నారని భార్య ఆందోళనకు దిగింది. భార్య మౌనిక అలియాస్ కీర్తనకు బాసటగా మహిళా సంఘాలు నిలిచాయి. ఇప్పటికే పలు మార్లు పంచాయితీ జరగగా 8 లక్షల 50 వేలు ఇచ్చి విడాకులు తీసుకుంటానని ఒప్పుకొని ఇవ్వడం లేదని ఆరోపించింది. నాలుగు సంవత్సరాల క్రితం పెళ్లి జరగగా పెళ్ళైన వారం రోజుల నుంచే అదనపు కట్నం కోసం వేధించిన భర్త పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేసింది.



## దేశభక్తి గేయాలను ఆలపించిన వనవాసీ విద్యార్థులు

**జయభేరి, చర్ల, జులై 15 :**

చర్ల మండలంలో స్వతంత్ర సమరయోధులు చింతలచెరువు వెంకటాద్రి వర్ధంతి వేడుక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నమస్తే వనవాసి కళ్యాణ పరిషత్ కొమరం భీం ఆవాస విద్యార్థులు ఎంతో అద్భుతంగా దేశభక్తి గేయాలను ఆలపించారు. అనంతరం వనవాసి కళ్యాణ పరిషత్ కొమరం భీమ్ ఆవాస విద్యార్థులను చర్ల మండల ప్రజలందరు అభినందించారు. నమస్తే కళ్యాణ్ పరిషత్ విద్యార్థులు చదువులో, సాంస్కృతి సాంప్రదాయ దేశభక్తి అలరించుతున్న కొమరం భీమ్ ఆవాస విద్యార్థులకి, సేవాభావంతో చర్ల మండల వనవాసి కళ్యాణ పరిషత్ ఆవాస కమిటీకి చల్ల మండల ప్రజలందరూ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

## పాఠశాల భవనంపై నుంచి దూకిన విద్యార్థిని

**జయభేరి, మంచిర్యాల:**

కస్తూర్బా పాఠశాల భవనం పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందొ విద్యార్థిని. మంచిర్యాల జిల్లా నస్పూర్ లోని ప్రభుత్వ కస్తూర్బా పాఠశాల విద్యార్థిని హాస్టల్ లో ఉండి చదువుకోవడం ఇష్టంలేక ఆత్మహత్య యత్నం చేసింది.. తొమ్మిదో తరగతి చదువుతున్న మధులిఖిత ఈరోజు పాఠశాల భవనంపై నుంచి దూకింది. విద్యార్థినికి గాయాలు కావడం తో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు..

## బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రోడ్డు వేస్తామని హామీలు



- హామీలు నెరవేర్చలేని స్థానిక ఎమ్మెల్యే
- బీ ఎస్ పీ కి అధికారం ఇస్తే ప్రజా సమస్యలు పరిష్కరమౌతాయి

**జయభేరి, చర్ల, జులై 15 :**

చర్ల మండలంలోని మొగల్లపల్లి గ్రామంలో బహుజన సమాజ్ పార్టీ చర్ల మండల నాయకత్వం మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో ఉన్న పలు రకాల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి ఆ గ్రామ ప్రజలు తీసుకువచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ చర్ల మండల అధ్యక్షులు కొండా చరణ్ మాట్లాడుతూ మొగలపల్లిలోని గ్రామ ప్రజలు గ్రామంలో నెలకొన్న సమస్యలతో సతమతమవుతున్నారని తక్షణమే ప్రభుత్వం అధికారులు స్పందించి ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రోడ్డు వేస్తామని ప్రగల్భాలు పలికి మంచిగా ఉన్న రోడ్డుని తవ్వి నాశనం చేశారని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వం వారి ప్రభుత్వం ఏర్పాటు అయితే ఈ రోడ్డుని త్వరితగతిన నిర్మిస్తామని, ఇప్పుడు ప్రభుత్వం కాంగ్రెస్ అయినప్పటికీ, ఎమ్మెల్యే కాంగ్రెస్ కి సంబంధించిన వారైనప్పటికి కూడా ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వ చేతగాని తనమనడానికి ఇదే నిదర్శనమన్నారు. గత బీఆర్ఎస్ గవర్నమెంట్ లో ఉన్న రోడ్లను నాశనం చేసే పని చేసిందని కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిపోయిందని విమర్శించారు. దండుపేట నుంచి సీ కత్తిగూడెం వరకు రోడ్డు నిర్మించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, నిరంతరం వాహనాల ప్రయాణాలకు అసౌకర్యంగా ఉందని, వర్షాకాలం మరింత సమస్యగా మారుతుందని అన్నారు. చర్ల మండల ప్రాంతానికి కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని దాని కారణంగా అందుకోసం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావుగారు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలవడం కోసం కాంగ్రెస్ టీఆర్ఎస్ పార్టీలు చెబుతున్న కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మొద్దని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య బద్ధంగా పరిపాలన కొనసాగడానికి బహుజన్ సమాజ్ పార్టీకి అధికారం ఇవ్వాలని తద్వారా సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ చర్ల మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల రాంబాబు, మండల కార్యదర్శి సామల ప్రవీణ్, చర్ల మండలం కోశాధికారి చెన్నం మోహన్, చర్ల మండల ఈసీ మెంబర్ గుర్రాల విజయ్ కుమార్, మండలం బీవీఎఫ్ కన్వీనర్ ములకాల సందీప్, లింగాపురం సెక్టార్ ప్రధాన కార్యదర్శి పంబి కుమారి, ఉప్పరగూడెం సెక్టార్ ప్రధాన కార్యదర్శి ఎస్ కే జహీరుద్దీన్ భాష, లింగాపురం సెక్టార్ కార్యదర్శి ఈశ్వరి, విజయలక్ష్మి, గ్రామస్తులు సుశీల తదితరులు పాల్గొన్నారు.



# కార్తికేయుడి కోసం కసరత్తులు

ఎన్టీఆర్‌త్రివిక్రమ్ కలయికలో కార్తికేయుడి ఇతివృత్తంతో భారీ పౌరాణిక చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. 'గాడ్ ఆఫ్ వార్ ఈజ్ కమింగ్' అంటూ ఈ సినిమా గురించి నిర్మాత సూర్యదేవర నాగవంశీ వెల్లడించిన దగ్గరి నుంచి అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. పౌరాణిక పాత్రల్లో తనదైన శైలి అభినయంతో మెప్పిస్తాడని ఎన్టీఆర్‌కు పేరుంది. దాంతో ఈ సినిమా విషయంలో ఆయన అభిమానులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. తాజాగా ఈ సినిమా గురించి నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వెల్లడించారు. రామాయణం కంటే బిగ్ కాన్వాస్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, వచ్చే ఏడాది ద్వితీయార్థంలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని తెలిపారు.
ఈ సినిమా పూర్వ నిర్మాణ పనుల్లో దర్శకుడు త్రివిక్రమ్ బిజీగా ఉన్నారని చెప్పారు. ఇదిలావుండగా ఈ సినిమా కోసం ఎన్టీఆర్ సైతం తన పాత్రను ఆకళింపు చేసుకునే ప్రయత్నాల్ని మొదలుపెట్టారు. కొద్దిరోజుల క్రితం ఎయిర్‌పోర్ట్‌లోకి వెళుతూ ఎన్టీఆర్ తన చేతిలో మురుగన్ (కార్తికేయుడి) ప్రాశస్త్యాన్ని తెలియజేసే పుస్తకాన్ని పట్టుకొని కనిపించారు ఎన్టీఆర్. హిందూ ధర్మంలో యుద్ధం, విజయానికి ప్రతీకలా భావించే శివుడి తనయుడు కార్తికేయుడి కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఎన్టీఆర్‌హృతిక్ రోషన్ కలిసి నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'వార్2' ఆగస్ట్ 14న విడుదలకు సిద్ధమవుతున విషయం తెలిసిందే.

# పాట రాసిన రామ్



మన హీరోలు పాటలు పాడటం కామనే కానీ..రాయడం మాత్రం అరుదనే చెప్పాలి. తన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా' కోసం హీరో రామ్ గీత రచయితగా అవతారమెత్తారు. భావోద్వేగభరితమైన ఓ పాటకు లిరిక్స్ అందించారు. ఈ పాటను స్వరకర్త అనిరుధ్ ఆలపించడం మరో విశేషమని మేకర్స్ తెలిపారు. 'గీత రచయితగా రామ్ తొలి ప్రయత్నమిది. చక్కటి భావాలు కలబోసి ఆయన అద్భుతమైన పాట రాశాడు. ఈ సాంగ్ విజువల్స్, లొకేషన్స్ అన్నీ మెస్మరైజింగ్‌గా అనిపిస్తాయి.
ఈ నెల 18న ఈ పాటను రిలీజ్ చేయబోతున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. మరోవైపు పోస్ట్‌ప్రొడక్షన్స్, ప్రమోషనల్ కార్యక్రమాల్ని మొదలుపెట్టారు. సినిమా హీరో అభిమాని కథగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళీశర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. వివేక్‌మెర్విన్ సంగీతాన్నందిస్తున్నారు.

# వెల్లువెత్తుతున్న విషెస్...



ప్రముఖ నటి కియారా అద్వానీ శుభవార్త చెప్పింది. కియారా అద్వానీ పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఈ మేరకు కియారా, సిద్ధార్థ్ సోషల్ మీడియా ద్వారా ఈ శుభవార్తను వెల్లడించారు. కియారా అద్వానీ తల్లయ్యిందని తెలియగానే ఆమె అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కియారా అద్వానీ, ఆమె భర్త సిద్ధార్థ్ మల్హోత్రాలకు శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుతున్నారు. ఈ స్టార్ కపుల్ వివాహం ఫిబ్రవరి 7, 2023న రాజస్థాన్‌లో చాలా వైభవంగా జరిగింది. 'షేర్షా' సినిమా సెట్స్‌లో వారిద్దరూ ప్రేమలో పడ్డారు. కియారా, సిద్ధార్థ్ తొలిసారి 'లస్ట్ స్టోరీస్' సినిమా ముగింపు పార్టీలో కలిశారు. ఈ పరిచయం మొదట స్నేహంగా, ఆ తర్వాత క్రమంగా ప్రేమగా మారింది. 2019 లో, ఇద్దరూ డేటింగ్ చేస్తున్నట్లు పుకార్లు పుట్టుకొచ్చాయి. ఆ తర్వాత 2021లో, కియారా , సిద్ధార్థ్ ఒకరి కుటుంబాలను ఒకరు కలుసుకున్నారు. ఫైనల్ గా 2023లో పెళ్లి చేసుకున్నారు. మొన్నామధ్య జరిగిన మెట్ గాలా ఫ్యాషన్ ఈవెంట్ 2025 లో కియార బేబీ బంప్‌తో హాజరై అందరి దృష్టిని ఆకర్షించింది. ఇదిలా ఉంటే ఇప్పుడు కియారా అద్వానీకి బేబీ పుట్టింది తెలియడంతో అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. కియారా ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.





# సమంత చిరంజీవి కాంబోలో మూవీ..

టాలీవుడ్ స్టార్ బ్యూటీ సమంత రూత్ ప్రభు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ అమ్మడు ఏమాయ చేశావే అనే లవ్ స్టోరీ మూవీతో తెలుగు వెండితెరకు పరిచయం అయ్యింది. ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. జెస్సీ పాత్రలో ఈ ముద్దుగుమ్మ ప్రతి ఒక్క కుర్రకారు మనసు దోచుకుంది. అయితే ఈ మూవీ రిలీజై జూలై18 నాటికి 15 ఏళ్లు పూర్తి చేసుకుంటుంది. ఈ క్రమంలోనే ఈ మూవీకి సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ నెట్టింట తెగ వైరల్ అవుతుంది. అది ఏమిటంటే? ఓ ఇంటర్వ్యూలో గౌతమ్ మేనన్ ఏమాయ చేశావే మూవీపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. అది ఏమిటంటే? ఈ మూవీలో చిరంజీవి కూడా నటించేవారంట. కానీ కొన్ని కారణాల వలన ఆయన ఈ సినిమాను రిజక్ట్ చేశాడంట. ఆమె మాట్లాడుతూ.. మొదటగా ఈ సినిమా మహేష్ బాబుతో తీయాలి అనుకున్నాను, అంతే కాకుండా ఈ సినిమాలో గెస్ట్ పాత్రలో చిరంజీవి కనిపించేలా ప్లాన్ చేశాను. క్లైమాక్స్ లో చిరంజీవి హీరోయిన్ పెళ్లి వేరేవాళ్లతో జరుగుతుందని తెలిసి, హీరోని హెలికాప్టర్ లో ఎక్కించుకొని పెళ్లి దగ్గరకు తీసుకెళ్లి హీరో,హీరోయిన్ ని కలుపుతాడు. ఇలా గెస్ట్ రోల్ ప్లాన్ చేశాను. కానీ ఈ మూవీని చిరు రిజక్ట్ చేశాడంట. ఒక వేళ చిరంజీవి ఈ సినిమా చేసి ఉంటే, సమంతకు తన ఫస్ట్ సినిమానే చిరంజీవితో నటించే అవకాశం వచ్చేదని అంటున్నారు ఈ ముద్దుగుమ్మ ఫ్యాన్స్ . అలా చిరు, సమంత కాంబోలో ఈ సినిమా మిస్సైందంట. ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యూస్ నెట్టింట తెగ వైరల్ అవుతుంది. ఇక ఏమాయ చేశావే మూవీ రిలీజై బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. కాగా, ఈ మూవీ రీరిలీజ్ కానుంది. దీంతో అభిమానుల ఆనందం గురించి ఎంత చెప్పినా తక్కువే.

# మీరు సినిమాలకు కథలు రాస్తారా?



దేశవ్యాప్తంగా ఉన్న యువతరం, భవిష్యత్ స్క్రీన్ రైటర్లను గుర్తించి, వెలుగులోకి తీసుకొచ్చే లక్ష్యంతో, ఒక మైలురాయి కార్యక్రమంగా జీ రైటర్స్ రూమ్ – ప్రారంభించినట్లు ప్రముఖ కంటెంట్, టెక్నాలజీ పవర్‌హౌస్ అయిన జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ('Z') సగర్వంగా ప్రకటించింది. జీ రైటర్స్ రూమ్ అనేది ప్రతిభను అన్వేషించే ప్రయత్నం కంటే మించినది——'యువర్స్ ట్రూలీ Z' అనే కంపెనీ బ్రాండ్ తాత్వికతతో ముడిపడిన ఒక సృజనాత్మక ఉద్యమం ఇది. అన్ని ప్లాట్‌ఫామ్‌లలోనూ తన కంటెంట్ సమర్పణను మరింత మెరుగుపరచడమే దీని లక్ష్యం. తాజా దృక్పథాల కోసం డిమాండ్ అత్యధికంగా ఉన్న నేపథ్యంలో, మూల కథ చెప్పే సామర్థ్యం , స్క్రీన్ రైటింగ్ అనే వృత్తిగత ప్రపంచం మధ్య అంతరం తగ్గించాలన్నది ఈ కార్యక్రమ ఉద్దేశం. ఎంపిక చేసిన రచయితలు 'Z'పరిధిలోని విస్తృత స్థాయి టీవీ, డిజిటల్, ఫిల్మ్ ప్లాట్‌ఫామ్‌ల కోసం కథలు రూపొందించేందుకు ఈ ఈ కార్యక్రమం అవకాశం అందిస్తుంది. 'Z'కి చెందిన కేంద్రీయ కంటెంట్, ప్రాంతీయ బృందాల దర్శకత్వంలో, భారతదేశపు వినోద ప్రకృతి దృశ్యంలో అభివృద్ధి చెందుతున్న అవసరాలతో అనుసంధానం కాలేకపోతున్న ప్రతిభకు అవకాశం కల్పించడం కోసం ఈ కార్యక్రమం రూపొందించింది. "భవిష్యత్ రచయితలకు అవకాశాల ద్వారాలు తెరిచి, వారి – కథలు, స్క్రిప్ట్‌లు, స్క్రీన్‌లు" వెలుగులోకి తీసుకొచ్చే ఏకైక దార్శనికతతో, ఏడు భారతీయ భాషల్లో ఉత్తేజకరమైన, ఆకర్షణీయమైన బ్రాండ్ ఫిల్మ్‌తో జీ రైటర్స్ రూమ్ కార్యక్రమం ప్రకటించబడింది. 80 నగరాలు, 32 ఈవెంట్ సెంటర్లలో విస్తరించడం ద్వారా, ఆన్‌ఎయిర్, డిజిటల్, ఆన్‌గ్రౌండ్ ప్లాట్‌ఫామ్‌లలో విస్తరించిన అధికప్రభావ ప్రమోషన్ ద్వారా ఈ కార్యక్రమం విస్తరించనుంది. హిందీ, మరాఠీ, బంగ్లా, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లోని నిబద్ధత కలిగిన కథకులు వారి ఊహ, నిర్మాణం, కథన నైపుణ్యం పెంపొందించుకునే దిశగా, సహకార రచయితల ప్రపంచంలోకి అడుగు పెట్టే అపూర్వ అవకాశం అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.
ఈ కార్యక్రమం గురించి జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ రాఘవేంద్ర హున్‌సూర్ మాట్లాడుతూ, "భారతదేశంలోని ప్రముఖ కథకుల్లో ఒకరిగా మారేందుకు ఇది మేము అందిస్తున్న అవకాశం మాత్రమే కాదు. భవిష్యత్తు తరం రచయితల ప్రతిభను పెంపొందించే మా కర్తవ్యం కూడా ఇందులో భాగమే. జీలో, మా అతిపెద్ద బలం మా కథనాలు మాత్రమే కాదు, మేము గుర్తించి, అవకాశం ఇచ్చే కథకులు కూడా అని మేము విశ్వసిస్తున్నాము. జీ రైటర్స్ రూమ్‌తో సరికొత్త స్వరాలు, ఇప్పటికింకా చెవినపడని ఆలోచనలు, నిజాయితీ కలిగిన భావోద్వేగాలు రూపం సంతరించుకునే ప్రదేశాన్ని మేము సృష్టిస్తున్నాము. ఇది ఒక పోటీ కాదు – ఇది ఒక నిబద్ధత. స్క్రీన్‌లలో, ప్రాంతాల్లో, శైలుల్లో శాశ్వత అనుభవాలు నిర్మించడం కోసం భారతదేశంలోని ప్రతి ప్రాంతానికి చెందిన రచయితలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడం ద్వారా క్రియేటర్లకు సాధికారత అందించడం, వారికి నైపుణ్యం, అవకాశం అందించడం మా విధి. ఎందుకంటే, కథ చెప్పే తీరు భవిష్యత్తు అనేది మనం ఏం చేస్తామనే దాని మీద మాత్రమే కాకుండా – మనం దేనితో ఆ పని చేస్తామనే దానిమీద కూడా అది ఆధారపడి ఉంటుంది" అన్నారు. చీఫ్ క్లస్టర్ ఆఫీసర్ – సౌత్ & వెస్ట్ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌గా ఉన్న సిజూ ప్రభాకరన్ మాట్లాడుతూ, "దేశంలోని అత్యంత శక్తివంతంగా కథలు చెప్పే సంస్కృతులకు, మరియు పశ్చిమ ప్రాంతాలు నిలయంగా ఉన్నాయి. అక్కడి ఆ అభిరుచి, సృజనాత్మకతను టీవీ, ఓటీటీ సినిమాల్లో వృద్ధి చెందగల వృత్తిగత నిర్మాణాత్మక కంటెంట్‌లోకి మళ్లించడంలో జీ రైటర్స్ రూమ్ సహాయపడుతుంది" అన్నారు. టీవీ, ఓటీటీలు, సినిమాల్లో 'Z'కి అవసరమైన కంటెంట్ కోసం ఆకర్షణీయ కొత్త ప్రపంచాలుగా, పాత్రోచితంగా కథన నిర్మాణాలుగా మలుస్తారు. **ఎన్‌రోల్ చేసుకోవడానికి, సందర్శించండి [www.zeewritersroom.com]. ప్రతి అభ్యర్థి ఈ లింక్‌లోకి వెళ్లాలి: రచయితల కోసం పరీక్ష: రిజిస్టర్ చేసుకున్న పార్టిసిపెంట్లు ఎంపిక కార్యక్రమానికి హాజరు కావాలి. కచ్చితంగా టెస్ట్ రాయాలి. రచనా ప్రతిభ ఆధారంగా, టాప్ 10% మందిని రీడింగ్ కమిటీ షార్ట్‌లిస్ట్ చేస్తుంది. ఇంటర్వ్యూ ప్రక్రియ: సినీ పరిశ్రమకి చెందిన ప్యానెల్ ఫైనలిస్టులని ఎంపిక చేస్తుంది. జీ రైటర్స్ రూమ్‌లోకి ప్రవేశం: టాప్ 100 మందిని జీ రైటర్స్ రూమ్‌లోకి ప్రవేశిస్తారు.** ఇక్కడ వాళ్లు నిపుణుల మార్గదర్శకత్వంలో కథా ఆలోచనలకు మెరుగులు దిద్దుతారు. మరెందుకు లేటు, తక్షణం, జీ రైటర్స్ రూమ్‌లో చేరడం ద్వారా, భవిష్యత్ కంటెంట్ రూపకర్తలుగా అవకాశం అందుకోండి.


Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com